ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



5

గుంటూరు జిల్లా వార్తలు

శుక్రవారం 3 జనవరి 2025



8

తెనాలి : సాలీడు ఏర్పరచుకున్న గూడుపై పడిన మంచుతో మెరిసిపోతున్న చిత్రం

ముత్యమల్లే మెరిసిపోయే మంచు తీగ

❖ కొత్త సంవత్సరంలో మంచు అందాలు ❖ పల్లెలు, పట్టణాలపై మంచు దుప్పటి ❖ ముత్యాలను తలపించేలా మంచు సోయగాలు



అమరావతిలోని సీడ్ యాక్సెస్ రోడ్డు వెంబడి ముమ్మరంగా సాగుతున్న చెట్లు తొలగించే పనులు

కొత్త ఏడాది.. రాజధాని రైతుల్లో కొంగొత్త ఆశలు నింపుతున్నాయి. కూటమి ప్రభుత్వం రాకతో ఈ ఏడాది మలి అర్ధభాగంలో సంతోషం కళ్ల చూసిన రాజధాని రైతులకు రాబోయే ఏడాది మరింత సంతోషాన్ని నింపుతుందని కోటి ఆశలతో ఎదురు చూస్తున్నారు. ఎంతో సంతోషంగా నూతన సంవత్సరానికి స్వాగతం పలుకుతున్నారు. ఐదేళ్ల వైసీపీ నిరంకుశ పాలనలో ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి నియంతృత్వం కింద నలిగిపోయిన రాజధాని రైతులు కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఊపిరి తీసుకున్నారు. అధికారంలోకి వచ్చీ రాక ముందే కూటమి ప్రభుత్వం రాజధాని అమరావతికి భరోసా కల్పించడం, నిర్మాణ పనుల్లో కదలిక తీసుకురావడంతో రైతుల ఆశలు తిరిగి ప్రాణం పోసుకున్నాయి. వారి ఆనందానికి అవధులు లేకుండా పోయాయి.



- కొత్త ఏడాది అమరావతిలో కొత్త వెలుగులు!
- కూటమి సర్కారు రావడంతో పూర్వ వైభవం
- అభివృద్ధి పనులతో దూసుకుపోతున్న నవనగరం
- ఆశావహంగా సాగిన ఈ ఏడాది మలి అర్ధభాగం
- కొత్త ఏడాది కొత్త భవనాలతో నగరం శోభాయమానం
- ఐదేళ్ల బాధలు.. కౌలు కష్టాలు తీరడంతో రైతుల్లో ఆనందం

కలల రాజధానిపై.. కొత్త ఆశలు



జీఏడీ టవర్స్ నిర్మించాల్సిన ప్రాంతంలో భారీ మోటార్లతో నిర్విరామంగా సాగుతున్న నీటిని తొలగించే పనులు





గుంటూరు, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): 2014లో అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చొరవ, కల్పించిన భరోసా కారణంగా రాజధానిలోని 28వేల మంది రైతులు భూ సమీకరణలో 34వేల ఎకరాల భూములు ఇచ్చారు. అప్పటి కూటమి ప్రభుత్వం రూ. 10వేల కోట్లతో రాజధానిలో శాశ్వత పరిపాలనా కార్యాలయాల నిర్మాణ పనులను చేపట్టింది. నాలుగేళ్లపాటు జోరుగా పనులు సాగడంతో నవ్యాంధ్ర రాజధాని కళకళలాడింది. 2019లో వచ్చిన వైసీపీ ప్రభుత్వం రైతుల ఆశలను, రాష్ట్ర ప్రజల ఆకాంక్షలను చిదిమేసింది. రాజధాని అమరావతిని శ్మశానంతో పోల్చి, పనులన్నింటినీ అర్ధాంతరంగా ఆపేసింది. రాజధాని రైతులపై, ప్రత్యేకించి మహిళలపై అనేక దాష్టీకాలకు పాల్పడింది. భూములిచ్చిన రైతులను వేధించడమే లక్ష్యంగా రైతుల కౌళ్లు నిలిపివేసింది. వాళ్లకు ఇవ్వాల్సిన రిటర్నబుల్ ప్లాట్లను ఆపేసింది. జోన్-5 పేరుతో రాజధానిలో చిచ్చు రాజేశారు. రైతుల భూములను వారికి ఇవ్వకపోగా వాటిని వేరెవరికో పందేరం చేశారు. శాంతియుతంగా ఆందోళన చేస్తున్న రైతులపై లాఠీలతో విరుచుకుపడింది. మహిళల పొత్తికడుపులపై పోలీసుల బూటు కాళ్లు విరుచుకుపడ్డాయి. ముళ్ల కంచెల్లో వేసి రైతులు, మహిళలను ఈడ్చుకుంటూ పోయి అరెస్టులు చేశారు. వేలాది మంది రైతులపై వందలాది కేసులు బనాయించి వేధించారు. అసైన్డ్ రైతుల భూములపై సీఐడీ కేసులు పెట్టి వారిని కౌలుకు అనర్హులుగా చేశారు. దళితులపైనే ఎస్సీ ఎస్టీ కేసులు పెట్టారు. ఇలా చెప్పుకుంటూ పోతే గడిచిన ఐదేళ్లలో రాజధానిలో రైతులు, మహిళలపై జరిగిన దాష్టీకాలకు అంతే లేకుండాపోతుంది. అంతటి దాష్టీకాలను సైతం రైతులు, మహిళలు సహనంతో, శాంతియుత పోరాటాలతో ఎదుర్కొని నిలిచారు. రాజధానిని నిలబెట్టుకున్నారు. తిరిగి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చే వరకూ అమరావతిని పొత్తిళ్లలో పెట్టుకుని కాపాడుకున్నారు.

● కూటమి రాకతో మారిన తలరాత

కూటమి ప్రభుత్వం రావడంతో రాజధాని తలరాత ఒక్కసారిగా మారిపోయింది. ఐదేళ్ల పాటు రైతులు, మహిళలకు కష్టాలు తొలగిపోయాయి. రాజధానికి భరోసా లభించడంతో వారి ఆశలు తిరిగి ఊపిరి పోసుకున్నాయి. రైతుల ఆశలను, రాష్ట్ర ప్రజల ఆకాంక్షలను గుర్తించిన కూటమి ప్రభుత్వం యుద్ధ ప్రాతిపదికన రాజధాని పనులు ప్రారంభించింది. ఐదేళ్ల పాలనలో అడవిలా మారిన అమరావతిని అద్దంలా మార్చే పనికి శ్రీకారం చుట్టింది. రూ. 36.5 కోట్ల రూపాయలతో జంగిల్ క్లియరెన్స్ పనులను నిర్వహించి కంపచెట్లను తొలగించింది. జూన్ 12న కొత్త ప్రభుత్వం ప్రమాణ స్వీకారం చేయడానికి ముందే అమరావతిలో జంగిల్ క్లియరెన్స్ పనులు ప్రారంభించి రాజధాని పట్ల తనకున్న చిత్త శుద్ధిని ప్రకటించింది. స్వయంగా ముఖ్యమంత్రి చంద్రబాబు, శాసనసభ స్పీకర్ అయ్యన్న పాత్రుడు రాజధాని గ్రామాల్లో పర్యటించి రైతులకు విశ్వాసం కల్పించారు. ఆగిపోయిన భవనాల నిర్మాణ పనులపై అధికారులను కదిలించారు. దీంతో రాజధానిలో నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి.

● ఎల్ఈడీ కాంతులతో నవనగరం..


కూటమి ప్రభుత్వం వచ్చిన వెంటనే రాజధాని రహదారులకు మోక్షం కలిగింది. అప్పటివరకూ కంప చెట్లతో నిండిపోయిన రోడ్లను అధికారులు వినియోగంలోకి తెచ్చారు. సీడ్ యాక్సిస్ రోడ్డుపై ఎల్ఈడీ విద్యుత్ దీపాలను ఏర్పాటు చేసి

(మిగతా 8వ పేజీలో)

కొందరికే.. కందిపప్పు

◆ అరకొరగా సరఫరా ◆ రాగి.. గోధుమ పిండి పంపిణీ నిలిపివేత ◆ జొన్నలూ లేవాయే





జొన్నలు

రేషన్ కార్డు దారులకు వైసీపీ ప్రభుత్వం నిలిపివేసిన రాయితీ కందిపప్పు సరఫరాను కూటమి ప్రభుత్వం పునరుద్ధరించింది. అయితే.. కందిపప్పు పంపిణీ రెండు నెలలకే పరిమితమైంది. ఈ నెల అరకొరగా కందిపప్పు సరఫరా చేశారు. కొందరు లబ్ధిదారులకే కందిపప్పు పంపిణీ పరిమితమైంది. జొన్నలు.. రాగి.. గోధుమ పిండి సరఫరా నిలిపివేశారు. పెద్ద పండుగ సంక్రాంతికి సరుకులు కోత విధించడంపై కార్డుదారులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

రేషన్ సరుకుల కుదింపుతో పేదలు ఇక్కట్లు పడుతున్నారు. బహిరంగ మార్కెట్‌లో కంది పప్పు కిలో రూ. 175 నుంచి రూ. 180 వరకు ధర పలుకుతున్నది. ప్రభుత్వం తెల్లకార్డు దారులకు ప్రతి నెల కందిపప్పు పంపిణీ చేయడంలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గత రెండు నెలలు కందిపప్పు ఇతర సరుకులను పంపిణీ చేసింది. ఈ నెలలో సరుకుల పంపిణీలో కోత విధించింది. ప్రైవేట్ మార్కెట్‌లో ధర పెరగడంతో ప్రభుత్వం రాయితీపై పంపిణీ చేసే కందిపప్పు కోసం ఆశగా ఎదురు చూస్తున్నారు. కార్డు దారులకు బియ్యం.. పంచదార పంపిణీతో సరిపెడుతున్నారు. కందిపప్పు అడిగితే పంపిణీ దారులు స్టాక్‌లేదంటున్నారు. పల్నాడు, బాపట్ల, గుంటూరు జిల్లాలకు అరకొరగానే ఈ నెలలో కందిపప్పు సరఫరా అయింది. మూడు జిల్లాలకు గోధుమ పిండి సరఫరా నిలిచిపోయింది. జొన్నలు ఒక్క పల్నాడు జిల్లాకే అది కూడా 7.17 శాతం కార్డు దారులకే సరఫరా చేశారు. గుంటూరు, బాపట్ల జిల్లాలకు జొన్నలు సరఫరా నిలిపివేశారు. రాగి పిండి కూడా పల్నాడు జిల్లాకు 0.19 శాతం పంపిణీ చేయగా బాపట్ల, గుంటూరు జిల్లాలకు పూర్తిగా నిలిపివేశారు.

- ◆ పల్నాడు జిల్లాలో 6,45,126 తెల్ల కార్డులు ఉన్నాయి. ఒక్కొక్క కార్డు దారునికి ఒక కిలో కందిపప్పు ప్యాకెట్ అందజేయాలి. ఈ నెలలో 27.26 శాతం కార్డుదారులకు మాత్రమే కందిపప్పు సరఫరా చేసినట్టు పౌరసరఫరాల శాఖ లెక్కలు తెలియజేస్తున్నాయి. 1,94,409 ప్యాకెట్లకు డీలర్ల నుంచి ఇండెంట్ వచ్చింది. 1,75,892 ప్యాకెట్ల కందిపప్పును మాత్రమే డీలర్లకు సరఫరా చేశారు.
- ◆ బాపట్ల జిల్లాలో 4,86,151 తెల్ల కార్డులు ఉన్నాయి. ఈ నెలలో 53.33 శాతం కార్డుదారులకు మాత్రమే కందిపప్పు సరఫరా చేస్తున్నారు. డీలర్ల నుంచి 2,69,762 ప్యాకెట్‌ల కందిపప్పు కోసం ఇండెంట్ వచ్చింది. దీనిలో 2,56,276 ప్యాకెట్‌ల కందిపప్పు కార్డుదారులకు పంపిణీ చేసేందుకు డీలర్లకు అందజేశారు.
- ◆ గుంటూరు జిల్లాలో 5,99,558 తెల్ల కార్డులు ఉన్నాయి. ఈ నెలలో 62.72 శాతం కార్డుదారులకు కందిపప్పు సరఫరా చేస్తున్నారు. డీలర్లు 3,93,627 కిందిపప్పు ప్యాకెట్‌ల కోసం ఇండెంట్ వచ్చింది. దీనిలో 3,76,046 కార్డుదారులకు పంపిణీ చేసేందుకు డీలర్లకు కందిపప్పు అందజేశారు.
- ◆ కందిపప్పు పంపిణీ కొందరికే పరిమితం కావడంతో పాటు రాగి గోధుమ పిండి.. జొన్నలు సరఫరా నిలిపివేయడంతో కార్డు దారులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం కిలో కందిపప్పు రాయితీపై రూ. 67కి ఇస్తున్నది. ప్రైవేట్ మార్కెట్‌లో దాదాపు రూ. 100 నుంచి రూ. 110 వరకు అధికంగా ఉండటంతో కార్డుదారులు రాయితీ కందిపప్పు పంపిణీ చేయాలని కోరుతున్నా పాలకులు పట్టించుకోవడంలేదన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. కందిపప్పుతో పాటు నిత్యావసర సరుకుల ధరలు పెరగడంతో పేదలపై మోయలేని ఆర్థిక భారం పడుతుండటంతో వారు ఆవేదన చెందుతున్నారు.

ఆర్టీసీ కార్గోకు పెరుగుతున్న ఆదరణ

- గత ఆర్థిక సంవత్సరంలో రూ.12 కోట్ల వసూలు
- రాష్ట్రంలోనే గుంటూరుకు మూడో స్థానం

6

మిర్చియార్డులో కమీషన్ ఏజంట్ల లైసెన్సుల పునః పరిశీలన

- నాలుగు బృందాలను నియమించిన మార్కెటింగ్ డైరెక్టర్

యార్డు ప్రక్షాళనకు శ్రీకారం

- పర్యవేక్షణకు ప్రత్యేక కమిటీల ఏర్పాటు
- ఇతర యార్డుల అధికారులకు స్థానం
- రాష్ట్ర మార్కెటింగ్ డైరెక్టర్ విజయ సునీత

8

ప్రత్తిపాడు నియోజకవర్గంలో 100 పడకల ఈఎస్ఐ ఆస్పత్రి

- నడింపాలెంలో భూమి కేటాయింపునకు కేబినెట్ ఆమోదముద్ర

గుంటూరు, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): ప్రత్తిపాడు నియోజకవర్గంలోని నడింపాలెంలో 100 పడకల ఈఎస్ఐ ఆస్పత్రి రాబోతున్నది. ఆస్పత్రితో పాటు సిబ్బంది నివాసం ఉండటానికి క్వార్టర్స్‌ని కూడా కేంద్ర ప్రభుత్వం నిర్మించనుంది. ఇందుకోసం అవసరమైన 6.35 ఎకరాల భూమిని ఈఎస్ఐ ఆస్పత్రి డైరెక్టర్ జనరల్ పేరు మీద బదలాయించేందుకు రాష్ట్ర మంత్రిమండలి ఆమోదం తెలిపింది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు రాగానే సర్వే నంబరు. 110-02లోని భూమిని జిల్లా యంత్రాంగం ఈఎస్ఐ ఆస్పత్రి యాజమాన్యానికి ఇవ్వనుంది. దీంతో ప్రత్తిపాడు పరిసర మండలాల్లోని కార్మికులకు వైద్య సేవల పరంగా ఎంతో మేలు జరగనుంది. కొత్తగా నిర్మించబోయే ఆస్పత్రిలో మల్టీస్పెషాలిటీ వైద్య సేవలు కూడా అందుబాటులోకి వస్తాయి. గుంటూరు జిల్లాకు ఒకే ఒక్క ఈఎస్ఐ ఆస్పత్రి దేవాపురంలో ఉన్నది. అయితే ఇక్కడ ప్రాథమిక వైద్యం తప్పా క్రిటికల్ కేర్ లభించడం లేదు. చాలావరకు ఇది ఒక రిఫరల్ ఆస్పత్రిగానే ఉంటున్నది. ఈ నేపథ్యంలో ఈఎస్ఐ పరిధిలోకి వచ్చే కార్మికుల కోసం వంద పడకల ఆస్పత్రిని నిర్మించేందుకు కేంద్రం నిర్ణయించి అందుకు అవసరమైన స్థలం కేటాయించాల్సిందిగా విజ్ఞప్తిని అందజేసింది. ఆ మేరకు రాష్ట్ర ప్రభుత్వం స్థలం ఇచ్చేందుకు అంగీకారం తెలపడంతో త్వరలోనే నడింపాలెంలో అన్నిరకాల వైద్యసేవలతో ఆస్పత్రి అందుబాటులోకి వస్తుంది. ఇదేవిధంగా మరో హెల్త్‌కేర్ యూనిట్ కూడా ప్రత్తిపాడుకు రాబోతున్నది. అలానే మిర్చియార్డు తరలింపు అనివార్యమైతే ప్రత్తిపాడులో నిర్మిస్తామని ఇప్పటికే మార్కెటింగ్ శాఖ మంత్రి ప్రకటించారు. ఈ మూడు ప్రాజెక్టుల నిర్మాణం పూర్తి అయితే ప్రత్తిపాడు రూపురేఖలే మారిపోతాయి. అంతేకాకుండా వాణిజ్యంగా ఎంతో అభివృద్ధి చెందుతుంది.

మధ్యాహ్న భోజనం.. మెనూలో మార్పులు

- స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీల సూచనల పరిగణలోకి
- ఏజన్సీలకు బకాయిలు చెల్లించేలా ఏర్పాట్లు

గుంటూరు(విద్య),జనవరి 2(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో అమలు చేసే డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనం పథకం మెనూలో మార్పులు సంక్రాంతి తరువాతే అమల్లోకి రానున్నాయి. విద్యార్థులకు పౌష్టిక విలువలతో కూడిన నాణ్యమైన భోజనం అందించడమే లక్ష్యంగా భారీ మార్పులు చేయబోతున్నారు. గత ప్రభుత్వ హయాంలో అస్తవ్యస్తమైన మధ్యాహ్న భోజన పథకాన్ని గాడిలో పెట్టేలా ఎన్డీఏ ప్రభుత్వం సన్నాహాలు ప్రారంభించింది. ఇందులో భాగంగా తొలుత స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీల్ని పునరుద్ధరించారు. వారి సూచనలు, తల్లిదండ్రుల అభిప్రాయాలు తీసుకుని మెనూలో మార్పులకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో ప్రభుత్వ, జడ్పీ, మండల పరిషత్,ఎయిడెడ్ సంస్థ ఆధ్వర్యంలో పాఠశాలలు నిర్వహిస్తున్నారు. ఇందులో ప్రాథమిక/ప్రాథమికోన్నత పాఠ శాలలు 4300పైగా ఉండగా, ఉన్నత పాఠశాల లు 345పైగా ఉన్నాయి. ఆయా పాఠశాలల్లో ఒకటవ తరగతి నుంచి 10వ తరగతి చదివే విద్యార్థిని విద్యార్థులు దాదాపు 6.45 లక్షల మంది ఉన్నారు. అయితే ఇందులో దాదాపు 20 నుంచి 35శాతం వరకు విద్యార్థులు వివిధ కారణాలతో మధ్యాహ్న భోజనం చేయడం లేదు. దీనికి ప్రధాన కారణాలు అనేక ఉన్నాయి. ఆయా విషయాలు అనేకసార్లు గత ప్రభుత్వం దృష్టికి విద్యాశాఖ నివేదిక రూపంలో అందించినా ఫలితం లేదు. ఈ నేపథ్యంలో కలెక్టర్లు సంబంధిత విభాగాలతో సమీక్ష నిర్వహించారు. పాఠశాలకు హాజరయ్యే విద్యార్థుల సంఖ్యకు భోజనం తీసుకునే విద్యార్థుల సంఖ్యకు మధ్య ఉన్న వ్యత్యాసాలు తొలగించడానికి ప్రణాళికలు సిద్ధం చేశారు.

మెనూలో మార్పులు ఇలా..

- ప్రభుత్వ, జడ్పీ, ఎయిడెడ్, మండల పరిషత్ పాఠశాలల విద్యార్థులకు మధ్యాహ్న భోజన కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విడుదల చేసే బడ్జెట్ తొలుత పెంచాలి. భోజనం కోసం సరఫరా చేసే బియ్యం పోర్టిఫైడ్ అంటూ లావుగా ఉన్న బియ్యం సరఫరా చేస్తున్నారు. వాటి స్థానంలో సన్న బియ్యం ఇవ్వాలని యాజమాన్యాల విజ్ఞప్తులు పరిశీలిస్తున్నారు.
- రోజువారీ మెనూలో అందించే చింతపండు పులిహోర బదులు లెమన్ రైస్ అడుగుతున్నారు. ఉదయం ఇచ్చే రాగిజావలో నాణ్యత ఉండటం లేదు. దానికి ప్రత్యామ్నాయంగా రాగితో చేసిన చిక్కీలు, లడ్డూలు ఇవ్వాలని లేదా పాలు ఇవ్వాలనే ప్రతిపాదన ఉంది.
- విద్యార్థుల రోజూవారీ మెనూలో ఒకరోజు ఇచ్చే పొంగలి కూడా తినటం లేదు. దీనిలో కూడా మార్పులు చేయాలి.
- మంగళగిరి, తెనాలి, తాడికొండ తదితర నియోజక వర్గాల్లో అక్షయ పాత్ర ఫౌండేషన్ ఆధ్వర్యంలో అందించే మధ్యాహ్న భోజనం సాంబారుతో కలిపి ఇస్తున్నారు. ఇలా కాకుండా వైట్‌రైస్ సాంబారు విడివిడిగా ఇవ్వాలనే విజ్ఞప్తులు ఉన్నాయి.
- అక్షయ పాత్ర ఫౌండేషన్ ఆధ్వర్యంలో పంపిణీచేసే మధ్యాహ్న భోజనంలో కోడి గుడ్డు ఇవ్వడం లేదు. ఇందుకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసి కోడిగుడ్లు కూడా సరఫరా చేయాలని యోచిస్తున్నారు.
- వంట ఏజెన్సీలు గుడ్డు ఉడకపెట్టి పెంకు తీసి ఇస్తున్నారని, దాన్ని పిల్లలు ఇష్టపడటం లేదు. ఉడికించిన గుడ్లు విద్యార్థులకే ఇస్తే వాళ్ళే పెంకు తీసుకొని వారే తినేలా ఏర్పాట్లు చేయాలి.
- ప్రతి శనివారం అక్షయపాత్ర ఫౌండేషన్ ఆధ్వర్యంలో జరిగే మధ్యాహ్న భోజన పథకంలో స్వీట్‌ను ప్రసాదంగా భావించి పిల్లలు తినటం లేదని దీనికి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని ఆలోచిస్తున్నారు.
- వంట ఏజెన్సీలకు బకాయిలు సకాలంలో చెల్లించడం లేదు. అప్పులు చేయాల్సి వస్తుందని, ఏ నెలకు, ఆనెల సకాలంలో బిల్లులు ఇస్తే అప్పులు బాధ తప్పుతుందని విజ్ఞప్తులు ఉన్నాయి. వంట చేసే ఏజన్సీలకు చెల్లించే ఛార్జీలు పెంచేలా ప్రభుత్వానికి నివేదించాలని యాజమాన్యాలు చేసిన విజ్ఞప్తులు పరిష్కరించేలా చర్యలు తీసుకోనున్నారు. ఆయా మార్పులతో సంక్రాంతి తరువాత నూతన మెనూ అమలు చేస్తారు.

ప్రజలకు ఇబ్బంది లేకుండా చూడాలి

- శంకర్‌విలాస్ ఆర్‌వోబీ డిజైన్లు ఫైనల్
- ట్రాఫిక్ మళ్ళింపుపై అధికారుల సమావేశం
- మ్యాప్‌ల ద్వారా పరిశీలించిన కలెక్టర్, ఎస్పీ, కమిషనర్



ట్రాఫిక్ మళ్లింపుపై ప్రణాళికలను పరిశీలిస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి, ఎస్పీ సతీష్‌కుమార్, కమిషనర్ శ్రీనివాసులు

గుంటూరు, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): నగరంలో శంకర్ విలాస్ వద్ద రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణ సమయంలో వాహనదారులకు ఇబ్బందులు లేకుండా ప్రత్యామ్నాయ మార్గాల్లో ట్రాఫిక్ మళ్ళింపునకు పకడ్బందీగా ప్రణాళికలు రూపొందించాలని కలెక్టర్ ఎస్ నాగలక్ష్మి అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో ఆమె జిల్లా ఎస్పీ సతీష్ కుమార్, నగరపాలక సంస్థ కమిషనరు పులి శ్రీనివాసులతో కలిసి ట్రాఫిక్ మళ్ళింపు మార్గాలపై మునిసిపల్, పోలీస్, రైల్వే అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు ట్రాఫిక్ మళ్లింపు రహదారులను మ్యాప్‌ల ద్వారా జిల్లా కలెక్టర్, ఎస్పీ, కమిషనర్‌కు వివరించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ నాగలక్ష్మి మాట్లాడుతూ శంకర్ విలాస్ వద్ద నూతనంగా నిర్మించే రైల్ ఓవర్ బ్రిడ్జ్ ఎలైన్‌మెంట్ డిజైన్లు ఫైనల్ అయినందున నిర్మాణ సమయంలో ట్రాఫిక్ మళ్లింపునకు నిర్దేశించిన రహదారుల విస్తరణ, అభివృద్ధికి మున్సిపల్, ఆర్ అండ్ బీ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ట్రాఫిక్ మళ్లింపు చేసే ప్రత్యామ్నాయ రహదారులలో ఆక్రమణలు తొలగించటంతో పాటు వాహనాలు పార్కింగ్ చేయకుండా ట్రాఫిక్, మున్సిపల్ అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. పాత బ్రిడ్జీ కూల్చివేసిన వెంటనే రహదారి విస్తరణ చేసిన ప్రాంతాల్లో సర్వీస్ రోడ్లు నిర్మించేలా చర్యలు తీసుకోవాలన్నారు. గతంలో మూసివేసిన బ్రాడీపేట 14వ అడ్డరోడ్డు రైల్వే గేటును తిరిగి ఓపెన్ చేసేందుకు ఉన్న అవకాశాలను పరిశీలించాలని రైల్వే అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో ఆర్ అండ్ బీ ఎస్ఈ శ్రీనివాస మూర్తి, ట్రాఫిక్ డీఎస్పీలు సీతారామయ్య, రమేష్, డివిజనల్ రైల్వే అసిస్టెంట్ ఆపరేటింగ్ మేనేజరు ముఖేష్ సింగ్, ఆర్ అండ్ బీ ఈఈ విశ్వనాథరెడ్డి, నగర పాలకసంస్థ సిటిప్లానర్ రాంబాబు, సీఐ అశోక్ పాల్గొన్నారు.

ప్రాథమిక ప్రణాళిక ఇలా...

- అమరావతి రోడ్డు నుంచి వచ్చే ఆర్టీసీ బస్సులు, భారీ వాహనాలు ఇన్నర్ రింగ్ రోడ్డు మీదగా బస్టాండ్ వైపునకు మళ్లింపు.
- లైట్ మోటర్ వాహనాలు పొట్టి శ్రీరాముల నగర్ జంక్షన్ నుంచి మూడు వంతెనల మార్గంలోకి డైవర్షన్.
- లక్ష్మీపురం వైపు నుంచి వచ్చే వాహనాలు లాడ్జి సెంటరు నుంచి కంకరగుంట ఆర్వోబీ రూట్‌లోకి మళ్లింపు.
- పాఠశాల బస్సులు, ఇతర అత్యవసర భారీ వాహనాలు కంకరగుంట ఓవర్ బ్రిడ్జ్ మీద నుంచి గుజ్జనగుండ్ల వైపునకు మళ్లింపు.

10 నుంచి నారెడ్కో కాపిటల్ జోన్ మెగా ప్రాపర్టీషో


ప్రాపర్టీ షో బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న కమిటీ సభ్యులు

గుంటూరు, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): నారెడ్కో కాపిటల్ జోన్ 12వ మెగా ప్రాపర్టీషో - 2025 ఈ నెల 10, 11, 12 తేదీల్లో జరుగనున్నదని ప్రాపర్టీషో కమిటీ ఛైర్మన్ గద్దె తిరుపతిరావు తెలిపారు. ప్రాపర్టీ షో ప్రారంభోత్సవ పూజా కార్యక్రమాలు గురువారం గుంటూరులోని చేబ్రోలు హనుమయ్య ప్రాంగణంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రాపర్టీషోకు ముఖ్యఅతిథిగా ముఖ్యమంత్రి చంద్రబాబు రానున్నట్లు చెప్పారు. ఆయనతోపాటు మంత్రి నారాయణ, కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ అతిథులుగా పాల్గొననున్నారని చెప్పారు. జనవరి 12న జరిగే షో ముగింపు కార్యక్రమంలో మంత్రులు అనగాని సత్యప్రసాద్, గొట్టిపాటి రవికుమార్, చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు తదితర ముఖ్య వ్యక్తులు పాల్గొంటారని చెప్పారు. షోలో మొత్తం 150 స్టాల్స్ ఏర్పాటు కానున్నాయని, బిల్డర్లు, రియల్ ఎస్టేట్, వ్యాపారస్తులు, జాతీయ బ్యాంకులు, ఫైనాన్స్ సంస్థలు, బిల్డింగ్ మెటీరియల్ సప్లయర్స్ సహా అనేక వర్గాల వారు పాల్గొంటారని చెప్పారు. కార్యక్రమంలో చుక్కపల్లి రమేష్, స్టేట్ జనరల్ సెక్రటరీ మామిడి సీతారామయ్య, క్యాపిటల్ జోన్ సెక్రటరీ శ్రీనాథ్, మధుసూదన రెడ్డి, మల్లికార్జునరావు, శ్రీనివాస్ కుమార్ బాబు, దుర్గాప్రసాద్, మాదాల శ్రీనివాస్ బాబు హరిశంకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు అవయవ దాతల సంఘం ఐదో మహాసభ

● హాజరుకానున్న ఆరోగ్య మంత్రి సత్యకుమార్

గుంటూరు మెడికల్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): సావిత్రిబాయి పూలే 194వ జయంతిని పురస్కరించుకొని అఖిల భారత శరీర అవయవ దాతల సంఘం ఐదో మహాసభ శుక్రవారం గుంటూరు వైద్య కళాశాల జింకాన ఆడిటోరియంలో నిర్వహిస్తున్నట్లు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, గుంటూరు ప్రభుత్వ సమగ్రాస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రమణ యశస్వి తెలిపారు. గురువారం తన ఛాంబర్‌లో ఆయన విలేకర్లతో మాట్లాడారు. మరణించినా అవయవదానంతో జీవించండి అనే నినాదంతో అవయవదానంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మహాసభకు ముఖ్యఅతిథిగా రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ పాల్గొంటారని తెలిపారు. రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ ఎంటీ కృష్ణబాబు, వైద్యవిద్య సంచాలకులు డాక్టర్ డీఎస్‌వీఎల్ నరసింహం, జనచైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి, సావిత్రిబాయి పూలే ఎడ్యుకేషన్ ఛారిటబుల్ ట్రస్ట్ చైర్‌పర్సన్, అఖిల భారత శరీర అవయవదాతల సంఘం వ్యవస్థాపకురాలు గూడూరు సీతామహాలక్ష్మి పాల్గొంటారని ఆయన వివరించారు. ఈ సందర్భంగా సావిత్రిబాయి పూలే జీవిత సాఫల్యత పురస్కారాన్ని ప్రముఖ గుండె మార్పిడి శస్త్రచికిత్స నిపుణులు డాక్టర్ ఆళ్ల గోపాలకృష్ణ గోఖలేకు అందజేయనున్నట్లు ప్రకటించారు. అదేవిధంగా అవయవదానంపై సమాజంలో అవగాహన కల్పిస్తున్న వ్యక్తులకు, సంస్థలకు సావిత్రిబాయి పూలే సేవా పురస్కారాలను ప్రదానం చేస్తామని అన్నారు. మంత్రి సత్యకుమార్ యాదవ్ అవయవదాతలకు ఐడీ కార్డులను పంపిణీ చేస్తారని, ప్రత్యేక సావనీర్‌ను ఆవిష్కరిస్తారని తెలిపారు. ఈ మహాసభకు దక్షిణ భారత దేశంలోని పలు రాష్ట్రాలకు చెందిన ప్రతినిధులు పాల్గొంటారని చెప్పారు.

రోడ్డు పాడైపోతుందని ప్రశ్నించినందుకు దాడి

ప్రత్తిపాడు, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని చినకోండ్రుపాడు వద్ద కొంతకాలంగా జరుగుతున్న మట్టి అక్రమ తవ్వకాలతో రోడ్డు పాడైపోతుందంటూ ప్రశ్నించిన గ్రామస్థునిపై మట్టి అక్రమం తవ్వకందారులు దాడి చేశారు. జాతీయ రహదారిని ఆనుకుని సుమారు కిలోమీటరు దూరంలో ఉన్న కాలనీకి సమీపంలో కొంత కాలంగా మట్టి అక్రమ తవ్వకాలు జరుగుతున్నాయి. విపరీతంగా లారీలు తిరగడంతో రోడ్డు పూర్తిగా పాడై పోయింది. ఈ క్రమంలో బుధవారం ఇదే విషయాన్ని స్థానికంగా ఉండే ఓ వ్యక్తి ప్రశ్నించారు. ఈ క్రమంలో ఇద్దరి మధ్య మాటలు పెరగటంతో గ్రామస్థునిపై మట్టి అక్రమ తవ్వకాలకు సంబంధించిన వ్యక్తి చేయి చేసుకున్నాడు. దీంతో కొద్దిపాటి ఘర్షణ జరగటంతో పోలీసులు వచ్చి వారిని పంపించి వేశారు. తిరిగి గురువారం ఉదయం చినకోండ్రుపాడు గ్రామస్థులు మట్టి తవ్వకాలను అడ్డుకునే ప్రయత్నం చేశారు. లారీలు తిరుగుతుండటం వలన రోడ్డు పాడై పోయిందంటూ గొడవకు దిగారు. ఈ క్రమంలో మట్టి అక్రమ తవ్వకందారులు, గ్రామస్థుల మధ్య తీవ్ర వాగ్వాదం జరిగింది. విషయం తెలుసుకున్న ప్రత్తిపాడు ఎస్ఐ నాగేంద్ర అందరినీ అక్కడి నుంచిపంపించి వేశారు. మట్టి తవ్వకందారుల చేతిలో దెబ్బలు తిన్న గ్రామస్థుడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. రెవెన్యూ అధికారులు తవ్వకాలను పరిశీలించారు. అక్రమ తవ్వకాలు అయితే వారిపై చర్యలు తీసుకుంటామని ప్రత్తిపాడు తహసీల్దార్ కరుణ కుమార్ తెలిపారు.

ఆర్టీసీ కార్గోకు పెరుగుతున్న ఆదరణ

● గత ఆర్థిక సంవత్సరంలో రూ.12 కోట్ల వసూలు
● రాష్ట్రంలోనే గుంటూరుకు మూడో స్థానం



గుంటూరు కార్గో పార్శిల్ కార్యాలయం

గుంటూరు, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ కార్గో పార్శిల్ సంస్థకు ప్రజల నుంచి ఆదరణ పెరుగుతోంది. గత ఆర్థిక సంవత్సరంలో ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా విస్తరించిన ఆర్టీసీ కార్గో రూ.12 కోట్ల వసూళ్లతో రాష్ట్రంలోనే మూడో స్థానానికి చేరుకుంది. వస్తు రవాణాకు గ్యారంటీ, నమ్మకం ఉండటంతో ఆర్టీసీ కార్గోకు ప్రజల నుంచి ఆదరణ లభిస్తుందని అధికారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. గతంలో ఆర్టీసీకి అనుబంధంగా ప్రైవేటు సంస్థ ఏఎన్ఎల్ పార్శిల్ రవాణా వ్యాపారం నిర్వహించారు. రాష్ట్ర విభజన అనంతరం ఆర్టీసీ సొంతంగా 2016 నుంచి ఆర్టీసీ కార్గో పార్శిల్ సంస్థకు శ్రీకారం చుట్టింది. వస్తువులు ఎక్కడి నుంచి ఎక్కడికైనా 24 గంటల్లో చేరేలా ప్రణాళికలు రూపొందించింది. సరుకు రవాణాపై కిలో మీటర్ల దూరం, వస్తువు బరువును బట్టి చార్జీ నిర్ణయిస్తున్నారు. ఉమ్మడి గుంటూరు జిల్లా కేంద్రం గుంటూరు ఎన్‌టీఆర్ బస్టాండ్‌లో కార్గో పార్శిల్ రవాణా సంస్థకు నిత్యం ప్రజల నుంచి ఆదరణ పెరుగుతోంది. ఇక్కడ నుంచి నిత్యం జిల్లాలోని పట్టణ ప్రాంతాలతో పాటు ప్రధానంగా హైదరాబాద్, విజయవాడ, విశాఖపట్నం, కాకినాడ, రాజమండ్రి, అనంతపూర్ ప్రాంతాలకు పెద్ద ఎత్తున సరుకు రవాణా జరుగుతుందని అధికారులు తెలిపారు. ఆర్టీసీ డిపోలతో పాటు జిల్లా వ్యాప్తంగా 20 మందికి పైగా ఆథరైజ్డ్ డీలర్లతో కమీషన్ ప్రాతిపదికన కార్గో పార్శిల్ ఏజెంట్ల ద్వారా సరుకు రవాణా చేస్తున్నారు. గత ఆర్థిక సంవత్సరంలో రూ.12.21 కోట్లతో రాష్ట్రంలోనే మూడో స్థానంలో ఉమ్మడి జిల్లా ఉండగా ప్రస్తుతం గత డిసెంబరు నాటికి దాదాపు రూ.9 కోట్ల ఆదాయంతో వ్యాపార లావాదేవీలు జరిపినట్లు తెలిపారు.

పర్యవేక్షణకు ప్రత్యేక అధికారులు

కార్గో పార్శిల్ సేవలకు సంబంధించి ప్రత్యేకంగా అధికారులను నియమించారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పర్యవేక్షణకు అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్ (ఏటీఎమ్), డిపోల వారీగా (డీఎమ్ఈ) డిపో మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్‌లు పర్యవేక్షిస్తున్నారు. వారిపై రీజనల్ మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్‌లు వ్యవహరిస్తున్నారు.

డోర్ డెలివరీ సేవలకు మరింత ప్రాధాన్యం



వస్తు రవాణాపై ఆర్టీసీ కార్గో పట్ల ప్రజలకు ఉన్న నమ్మకమే ఆదరణను పెంచుతుంది. వస్తువులకు గ్యారంటీతో పాటు 24 గంటల్లో గమ్యస్థానాలకు పంపుతున్నాం. కార్గోలో డోర్ డెలివరీ సేవలను మరింత విస్తృతం చేసే దిశగా చర్యలు తీసుకుంటున్నాం. ఇందుకోసం జిల్లా ప్రజా రవాణాధికారి ఎమ్.రవికాంత్ నేతృత్వంలో ఇప్పటికే గత నెల 19 నుంచి ఈ నెల 19 వరకు ఆర్టీసీ కార్గో డోర్ డెలివరీ మాసోత్సవాలు నిర్వహిస్తున్నాం. కార్గో సేవలు మరింత విస్తృతం చేసి రాష్ట్రంలోనే గుంటూరు కార్గోను మొదటి స్థానంలో నిలపటమే లక్ష్యంగా పెట్టుకున్నాం.

- డి.ఆదినారాయణ. గుంటూరు కార్గో ఏటీఎం

పత్తిని కొని.. అమ్మాలి

● జిన్నింగ్ ప్రక్రియ సీసీఐ లక్ష్యానికి వ్యతిరేకం
● హైకోర్టులో సీసీఐ మాజీ జనరల్ మేనేజర్ పిటీషన్
● సంస్థ చర్యలు వల్ల ప్రభుత్వానికి రూ.17,500 కోట్లు నష్టం
● కౌంటర్ దాఖలు చేయాలని ప్రతివాదులకు హైకోర్టు ఆదేశం

గుంటూరు సిటీ, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియాను (సీసీఐ) భారీ వివాదం చుట్టుముట్టింది. పత్తి కొనుగోలు చేసి పత్తిని మాత్రమే అమ్మాలన్న నిబంధనను అతిక్రమించడం ద్వారా సీసీఐ పరిధి దాటిందని ఆంధ్రప్రదేశ్ హైకోర్టులో రిట్ పిటీషన్ దాఖలైంది. గుంటూరుకు చెందిన సీసీఐ మాజీ జనరల్ మేనేజర్ ఈ పిటీషన్ దాఖలు చేశారు. ప్రతి సీజన్‌లో దేశవ్యాప్తంగా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి పత్తిని సేకరిస్తున్న సీసీఐ జిన్నింగ్ ప్రక్రియను చేపడుతోంది. మెమోరాండం ఆఫ్ అసోసియేషన్ ఆఫ్ ది కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ నిర్దేశించుకున్న లక్ష్యాలకు పత్తి జిన్నింగ్ ప్రక్రియ వ్యతిరేకం అని మాజీ జనరల్ మేనేజర్ ఆ పిటీషన్‌లో పేర్కొన్నారు. మెమోరాండం ఆఫ్ అసోసియేషన్‌లో కేవలం పత్తిని సేకరించి ముడి పత్తినే అమ్మాలన్న నిబంధన ఉందని ప్రస్తావించారు. ఒకవేళ అంతకు మించి ఏమైనా చేయాలంటే దానికి కేంద్ర ప్రభుత్వం అనుమతి, అందుకు సంబంధించిన స్పష్టమైన ఉత్తర్వులు ఉండాలని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. దేశవ్యాప్తంగా సీసీఐ చేస్తున్న జిన్నింగ్ ప్రక్రియకు ప్రభుత్వం అనుమతి లేదన్న విషయాన్ని కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ శాఖ మంత్రి డిసెంబరు 17వ తేదీన పార్లమెంట్‌లో వెల్లడించారని పిటీషన్‌లో పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఎంపీ అడిగిన ప్రశ్నకు కేంద్ర మంత్రి సమాధానం ఇస్తూ సీసీఐ రైతుల వద్ద మద్దతు ధరకు కేవలం పత్తిని కొనుగోలు మాత్రమే చేస్తుందన్న విషయాన్ని వెల్లడించారని, అందుకు సంబంధించిన డాక్యుమెంట్‌ను పిటీషన్‌లో పొందుపరిచారు. సీసీఐ దేశవ్యాప్తంగా జిన్నింగ్ ప్రక్రియ చేపట్టడం వల్ల 2014-2021 వరకు రూ. 17,500 దాకా నష్టం వాటిల్లిందని పేర్కొన్నారు. 2023-2024 సంవత్సరానికి మరో రూ. రెండు వేల కోట్ల వరకు నష్టం వాటిల్లి ఉంటుందని పేర్కొన్నారు. ఈ నష్టాన్ని కేంద్రం భర్తీ చేసిందని వెల్లడించారు. సీసీఐ కేవలం పత్తిని కొనుగోలు చేసి పత్తిని విక్రయిస్తే ఇంత నష్టం జరగదనేది మాజీ మేనేజర్ వాదన. సీసీఐ పోకడలు వల్ల జిన్నింగ్, స్పిన్నింగ్ పరిశ్రమ పూర్తిగా దెబ్బతింటుందని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. సీసీఐ జిన్నింగ్ ప్రారంభించడం వలన వందల కొద్దీ జిన్నింగ్ మిల్లులు మూతపడిపోతున్నాయని పేర్కొన్నారు. రైతులకు మద్దతు ధర ఇచ్చి కొనుగోలు చేసిన పత్తిని ఆన్‌లైన్‌లో విక్రయాలు జరిపితే జిన్నింగ్ మిల్లుల యజమానులు దానిని కొనుగోలు చేసి దూదిగా మార్చుతారని పిటీషన్‌లో వివరించారు. సీసీఐ కంపెనీస్ చట్టం-1956ను పూర్తిగా ధిక్కరించిందని అందుకు పూర్తి బాధ్యత షేర్ హోల్డర్స్‌దేనని పేర్కొన్నారు. లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా కంపెనీస్ చట్టాన్ని అతిక్రమించి చెల్లింపులు చేసిన కేసులో సుప్రీంకోర్టు ధర్మాసనం ఇచ్చిన తీర్పును సీసీఐ మాజీ మేనేజర్ హైకోర్టు దృష్టికి తీసుకెళ్లారు. కంపెనీస్ చట్టపరంగా చేయాల్సిన వ్యాపార లావాదేవీలను మించి నిర్ణయాలు తీసుకునే అధికారం సీసీఐకి లేదని పేర్కొన్నారు. పత్తిని కొనుగోలు చేసి పత్తిని మాత్రమే విక్రయించాలన్న నిబంధనను పాటించకపోవడం కంపెనీస్ చట్టంలోని సెక్షన్ 245 ప్రకారం పరిమితికి మించి, చట్టాన్ని మించి (అల్ట్రా వైర్స్)గా భావించాలని కోర్టును అభ్యర్థించారు. కౌంటర్ దాఖలు చేయాలని కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియాతో పాటు, ఇతర ప్రతివాదులను ఆదేశిస్తూ ఈ నెల 6 కు కేసును హైకోర్టు వాయిదా వేసింది.

కమీషన్ ఏజంట్ల లైసెన్సుల పునఃపరిశీలన

● నాలుగు బృందాలను నియమించిన మార్కెటింగ్ డైరెక్టర్
● 7లోపు నివేదిక సమర్పించాలని ఆదేశం
● మెమోలో 'ఆంధ్రజ్యోతి' కథనం ప్రస్తావన

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

గుంటూరు, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ మార్కెట్ కమిటీ గుంటూరు(మిర్చియార్డు)లో కమీషన్ ఏజంట్స్ లైసెన్సుల ప్రొప్రయిటర్ల మార్పులో జరిగిన అక్రమాలపై పరిశీలన చేసేందుకు మార్కెటింగ్ శాఖ డైరెక్టర్ విజయ సునీత నాలుగు బృందాలను నియమించారు. ఈ నెల 30న 'ఆంధ్రజ్యోతి' గుంటూరు జిల్లా ఎడిషన్‌లో 'తీసుకోవడం... అమ్ముకోవడం' అనే శీర్షికతో ప్రచురితమైన కథనాన్ని డైరెక్టర్ ప్రస్తావిస్తూ మెమో విడుదల చేశారు. ఒక్కో బృందంలో సెలెక్షన్ గ్రేడ్ స్థాయి సెక్రెటరీ, మరో అసిస్టెంట్ సెక్రెటరీని నియమించారు. ఈ నాలుగు బృందాలను పర్యవేక్షించే బాధ్యతలను మార్కెటింగ్ శాఖ డిప్యూటీ డైరెక్టర్‌ని నియమించారు. వారం వ్యవధిని ఇచ్చిన కమిషనర్ అన్ని లైసెన్సులను పరిశీలన చేసి తనకు నివేదిక అందజేయాలని మెమోలో స్పష్టంగా పేర్కొన్నారు. దాంతో నాలుగు టీంలు గుంటూరు మిర్చియార్డుకు చేరుకొని ప్రొప్రయిటర్ పేర్ల మార్పులను పరిశీలిస్తున్నారు.

వైసీపీ హయాంలో...

గత వైసీపీ ప్రభుత్వ హయాంలో మిర్చియార్డులో విచ్చలవిడిగా కమీషన్ ఏజంట్స్ లైసెన్సుల్లో ప్రొప్రయిటర్ల పేర్లు మార్పులు జరిగాయి. ఒక్కో పేరు మార్పు చేసినందుకు రూ. లక్షన్నర నుంచి రూ. 3 లక్షల వరకు వసూలు చేశారన్న ఆరోపణలు వెల్లువెత్తాయి. ఇలా దాదాపుగా 282 లైసెన్సుల ప్రొప్రయిటర్ల పేర్లు మార్పులు జరిగాయి. విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డిపార్టుమెంట్ కూడా ఇటీవల జరిగిన విచారణలో ప్రొప్రయిటర్ల పేర్ల మార్పుల్లో అవినీతి జరిగినట్లు ధ్రువీకరించి ప్రభుత్వానికి నివేదించింది. అలానే గత నెల 5న రాష్ట్ర మార్కెటింగ్ శాఖ మంత్రి కె.అచ్చెన్నాయుడు నిర్వహించిన సమావేశంలో ఈ అంశం ప్రస్తావనకు రాగా అన్ని లైసెన్సులను పునఃపరిశీలన చేయిస్తామని ప్రకటించారు. ఆ మేరకు మార్కెటింగ్ డైరెక్టర్ విజయ సునీత తాజాగా ఉత్తర్వులు జారీ చేశారు.

కమిటీల్లో నియమితులైన అధికారులు వీరే...

మొదటి కమిటీకి తెనాలి ఏఎంసీ సెలెక్షన్ గ్రేడ్ సెక్రెటరీ జేవీ సుబ్బారావు, సహాయకుడిగా కూచినపూడి ఏఎంసీ అసిస్టెంట్ సెక్రెటరీ జీహెచ్ ఎలహానన్, చిలకలూరిపేట ఏఎంసీ సూపర్‌వైజర్ వి.నరసింహారెడ్డిని నియమించారు. రెండో కమిటీకి కృష్ణా జిల్లా గుడివాడ ఏఎంసీకి చెందిన సెలెక్షన్ గ్రేడ్ సెక్రెటరీ వి. భాస్కరరావు, సహాయకుడిగా పొన్నూరు ఏఎంసీ గ్రేడ్-2 సెక్రెటరీ మురళీధర్, సూపర్‌వైజర్ అవినాష్, మూడో కమిటీకి చిలకలూరిపేట ఏఎంఎసీ సెలెక్షన్ గ్రేడ్ యూ యోగేశ్వరరావు, సహాయకులుగా కొండేపి అసిస్టెంట్ సెక్రెటరీ జీవీ రవికుమార్, ఫిరంగిపురం ఏఎంసీ సూపర్‌వైజర్ చంద్రశేఖర్, నాల్గో కమిటీకి రేపల్లె ఏఎంసీ గ్రేడ్-3 సెక్రెటరీ జి.వేణుగోపాల కృష్ణ, సహాయకులుగా కంకిపాడు అసిస్టెంట్ సెక్రెటరీ పి.అప్పారావు, వేమూరు సూపర్‌వైజర్ ఎస్.అంజిబాబుని నియమించారు. కాగా మార్కెట్ కమిటీలో ఎన్ని దుకాణాలున్నాయి, వాటిల్లో ఇతరులకు లీజుకు ఇచ్చినవి ఎన్ని, కమీషన్ ఏజంట్ లైసెన్సులు, వేమెన్ లైసెన్సుల వివరాలతో కూడిన నివేదికని ఇప్పటికే సెక్రెటరీ ఆంజనేయులు సమర్పించారు. ఈ నేపథ్యంలో సెక్రెటరీ అందజేసిన నివేదికని క్రాస్ చెక్ చేయాల్సిందిగా డైరెక్టర్ ఆదేశించడం యార్డులో కలకలం రేకెత్తిస్తుంది.

కోల్డ్ స్టోరేజ్ గుమస్తా రూ.7 కోట్లతో పరార్


రైతు సంఘం నాయకులతో బాధిత శనగ రైతులు

చిలకలూరిపేట, జనవరి 2(ఆంధ్రజ్యోతి): చిలకలూరిపేట ప్రాంతంలో జాతీయ రహదారి పక్కన ఉన్న ఒక కోల్డ్ స్టోరేజ్‌లో పనిచేసే నాగరాజు అనే ఉద్యోగి చిలకలూరిపేట, యద్దనపూడి, మార్టూరు మండలాల్లోని సుమారు 70 మంది రైతులను సుమారు రూ.7 కోట్ల మేర మోసం చేసినట్టు బాధిత రైతులు గురువారం ఆరోపించారు. రైతులు పట్టణంలోని సీపీఎం కార్యాలయంలో రాష్ట్ర రైతు సంఘం నాయకులను ఆశ్రయించి తమ గోడును వెళ్లబోసుకున్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రైతు సంఘం అధ్యక్షుడు వి.కృష్ణయ్య, రైతు సంఘం సీనియర్ నాయకుడు జి.చలమయ్య, ఆంధ్రప్రదేశ్ కౌలు రైతుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వై.రాధాకృష్ణ, సీఐటీయూ బాపట్ల జిల్లా ఉపాధ్యక్షుడు బి.హనుమంతురావును కలిసి జరిగిన మోసాన్ని వివరించారు. తమ వద్ద శనగలు కొని 15 రోజుల్లో డబ్బు చెల్లిస్తానని చెప్పి నాగరాజు పరారయ్యాడని తెలిపారు. సేకరించిన శనగలను సమీపంలోని పప్పు మిల్లుకు తరలించి అమ్మకం చేసుకుని నగదు వసూలు చేసుకుని కుటుంబంతో సహా పరారైనట్టు బాధిత రైతులు వాపోయారు. సమస్యను నాయకులు, పోలీసుల దృష్టికి తీసుకెళ్లినా తమకు న్యాయం జరగలేదని రైతులు వివరించారు. ఈ సమస్యపై ఒక ఉద్యమ కార్యాచరణకు ప్రణాళిక రూపొందిస్తామని అన్నారు. రైతులకు అండగా ఉంటామని అన్నారు. సమస్యను నాలుగైదు రోజుల్లో రాష్ట్ర ముఖ్యమంత్రి, వ్యవసాయ శాఖ మంత్రి దృష్టికి తీసుకు వెళ్తామని రైతు సంఘం నాయకులు ప్రకటించారు.

ఎన్జీ రంగా యూనివర్సిటీ డైరీ ఆవిష్కరణ


డైరీ ఆవిష్కరిస్తున్న మంత్రి అచ్చెన్నాయుడు

గుంటూరు సిటీ, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ యూనివర్సిటీ డైరీ, క్యాలెండర్‌ను రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు గురువారం సచివాలయంలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో యూనివర్సిటీ వీసీ శారద జయలక్ష్మి, పరిశోధన సంచాలకులు డాక్టర్ పీవీ సత్యనారాయణ, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

హైకోర్టులో ఘనంగా నూతన సంవత్సర వేడుకలు

అమరావతి, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): హైకోర్టులో నూతన సంవత్సర వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. హైకోర్టు ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, న్యాయమూర్తులు అందరూ హాజరయ్యారు. హైకోర్టు ఉద్యోగుల సంఘానికి చెందిన క్యాలెండర్‌ను ఈ సందర్భంగా విడుదల చేశారు. 25 కేజీల కేకును కట్ చేసి అందరికీ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ జనరల్ వై.లక్ష్మణరావు, రిజిస్ట్రార్‌లు, ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు అక్కెన వేణుగోపాల్, ఉపాధ్యక్షుడు కె.సురేంద్రనాథ్, కార్యదర్శి ఎం.ఎలీషా, ఆర్గనైజింగ్ సెక్రెటరీ జి.చంద్రబాబు, సంయుక్త కార్యదర్శి జి.కోటేశ్వరరావు, ఇతర కార్యవర్గ సభ్యులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

నాగార్జున కొండను సందర్శించిన విదేశీ బౌద్ధ పరిశోధకులు


మ్యూజియంలో విదేశీ బౌద్ధ పరిశోధకులు

మాచర్ల రూరల్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): న్యూజిల్యాండ్, ఆస్ట్రేలియా, హాంకాంగ్, తైవాన్ దేశాలకు చెందిన బౌద్ధ పరిశోధకులు గురువారం నాగార్జున కొండను సందర్శించారు. కొండపై గల మ్యూజియంలోని బౌద్ధ శిల్పాలు, శాసనాలు, శ్రీ చేత్యము తదితర వాటిపై పురావస్తు పరిశోధకుడు, బుద్ధవనం కన్సల్టెంట్, ప్లీచ్ ఇండియా సీఈవో డాక్టర్ ఈమని శివనాగిరెడ్డి వివరించారు. కొండను సందర్శించిన వారిలో న్యూజిల్యాండ్‌కు చెందిన ప్రొఫెసర్ సారా, ఆస్ట్రేలియా ప్రొఫెసర్ జాఫ్రియా, హాంకాంగ్, తైవాన్లకు చెందిన ముగ్గురు పరిశోధకులు ఉన్నారు. కార్యక్రమంలో బుద్ధవనం అధికారులు డీఆర్ శ్యాం సుందరరావు, డాక్టర్ రవిచంద్ర పాల్గొన్నారు.

వివాహేతర సంబంధం నేపథ్యంలో హత్య


నాగరాజు(ఫైల్)

నగరం, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిన్నమట్లపూడి గ్రామంలో బుధవారం అర్ధరాత్రి దారుణ హత్య జరిగింది. గ్రామానికి చెందిన లుక్కా నాగరాజు(43)ను అదే గ్రామంలో చిరువ్యాపారం నిర్వహించే భాస్కరుని సాంబయ్య అనే వ్యక్తి హత్య చేశాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. వివాహేతర సంబంధం నేపథ్యంలో ఈ హత్య జరిగినట్లు అనుమానం వ్యక్తం చేశారు. నాగరాజు భార్య శిరీషా ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. నగరం ఎస్ఐ బండి భార్గవ్ హత్యకు సంబంధించి దర్యాప్తును వేగవంతం చేస్తామని చెప్పారు. మృతుడికి భార్య, అమ్మాయి, అబ్బాయి, తండ్రి లుక్కా గుడారంకయ్య ఉన్నారు.

జూనియర్ అసిస్టెంట్ సస్పెన్షన్

కాకుమాను, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): కాకుమాను మండల ప్రజా పరిషత్ అభివృద్ధి కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న కె.వినోద్‌కుమార్‌ను సస్పెండ్ చేస్తూ జిల్లా పరిషత్ సీఈవో ఆదేశాలు జారీ చేసినట్లు ఎంపీడీవో యుగకీర్తి గురువారం తెలిపారు. ఎంపీడీవో కార్యాలయంలో సమావేశాలకు సంబంధించిన తీర్మానాల పేజీలను మినిట్స్ పుస్తకం నుంచి చించేశారు అని ఎంపీడీవో యుగకీర్తి జిల్లా ఉన్నతాధికారులతోపాటు స్థానిక పోలీస్ స్టేషన్‌లో లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. పుస్తకంలో 7వ పేజీ నుంచి 270 పేజీల వరకు చించి వేసి పేజీలు మార్చి ఉన్నాయని ఫిర్యాదులో పేర్కొన్నారు. కార్యాలయంలో ఏవో సెలవులో ఉండడంతో జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న వినోద్‌కుమార్ పుస్తకాలను నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. ఎంపీడీవో ఫిర్యాదు మేరకు జిల్లా డిప్యూటీ సీఈవోల బృందం గత నెల 23 నుంచి 26 వరకు కార్యాలయంలో మినిట్స్ పుస్తకంలో పేజీల చించివేతపై దర్యాప్తు చేసి నివేదికను జిల్లా ఉన్నతాధికారులకు అందజేశారు. ఈ మేరకు వినోద్‌కుమార్‌ను సస్పెండ్ చేస్తూ ఆదేశాలు జారీ చేసినట్లు ఎంపీడీవో వివరించారు.

రైలు ఢీకొని వ్యక్తి మృతి

తెనాలి క్రైం, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొని వ్యక్తి మృతి చెందిన సంఘటన కొలకలూరు రైల్వేస్టేషన్ వద్ద గురువారం జరిగింది. రైల్వే ఎస్ఐ జి.వెంకటాద్రి తెలిపిన వివరాల ప్రకారం కొలకలూరు రైల్వేస్టేషన్ సమీపంలో నివాసం ఉండే మోదుకూరి విజయ్‌కుమార్ (45) గురువారం ఉదయం 8.30 గంటల సమయంలో ఎదురుగా వస్తున్న రైలును గుర్తించకుండా పట్టాలు దాటుతున్నాడు. అదే సమయంలో విజయవాడ వైపు వెళ్లే రైలు ఢీకొని అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి వినికిడిలోపం ఉండటంతో ట్రైన్ సౌండ్ వినిపించక అప్రమత్తంగా లేకపోవడంతో ఈ ఘటన జరిగి ఉండవచ్చని బంధువులు తెలిపినట్లు పోలీసులు వెల్లడించారు. దీనిపై కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నట్లు ఎస్ఐ తెలిపారు.

సాగర్ ప్రాజెక్ట్ నీటి సమాచారం

మాచర్ల రూరల్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ నీటి మట్టం గురువారం నాటికి 569.80 అడుగులు ఉంది. ఇది 256.07 టీఎంసీలకు సమానం. కుడి కాలువ ద్వారా 9019 క్యూసెక్కులు, ఎడమ కాలువ ద్వారా 8193 క్యూసెక్కులు, ప్రధాన జలవిద్యుత్ కేంద్రం ద్వారా 29,736 క్యూసెక్కులు, ఎస్ఎల్‌బీసీ ద్వారా 2400, ఎల్ఎల్‌సీ ద్వారా 300 క్యూసెక్కులు, మొత్తం ఔట్‌ఫ్లో వాటర్ 49,648 క్యూసెక్కులను విడుదల చేస్తున్నారు. శ్రీశైలం నుంచి నాగార్జున సాగర్‌కు ఇన్‌ఫ్లో వాటర్‌గా 38,023 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.50 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	111,119,130
చికెన్ విత్ స్కిన్	210.00
చికెన్ స్కిన్ లెస్	220.00

45,404 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు గురువారం 47,491 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 45,404 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి వినుకొండ ఆంజనేయులు తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 49,563 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర	వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ			ఏసీ కామన్ వెరైటీ		
334	7500	13000	334	7500	13700
నెంబరు. 5	8300	11500	నెంబరు.5	8000	11200
273	9500	11200	273	9000	10500
341	8000	15000	341	7500	12000
4884	8300	11000	4884	12500	12500
సూపర్ 10	8600	8600	సూపర్ 10	--	--
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ			ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	7500	16500	తేజ	8500	16000
బ్యాడిగి	7500	13000	బ్యాడిగి	7500	11600
దేవనూరు డీలక్స్	9000	15000	దేవనూరు డీలక్స్	15600	15600
తెల్లకాయలు	4000	10000	తెల్లకాయలు	4000	9500

పూలమార్కెట్‌లో 18వ నంబర్ దుకాణం వ్యవహారంలో
బాధితుడికి న్యాయం జరిగేనా?

గుంటూరు, జనవరి 2 (ఆంధ్రజ్యోతి) : స్థానిక ఎన్టీఆర్ ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఉన్న పూల మార్కెట్‌లో వైసీపీ నేతల దందాపై వ్యాపారులు ఆందోళన చెందుతున్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో ఆ పార్టీకి చెందిన కొందరు నాయకులు బెదిరించి ఏకంగా షాపులనే లాక్కున్నారు. 18వ నంబరు దుకాణం వ్యవహారం ఎప్పటినుంచో వివాదాస్పదంగా ఉంది. 2016 మార్చి 20న అప్పటి టీడీపీ ప్రభుత్వం ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఉన్న రైతు బజారులో 45 మంది పూల వ్యాపారులకు ఈ షాపులు కేటాయించింది. అందులో 18వ నంబర్ షాపును టీడీపీ కార్యకర్త పూసపాటి దుర్గాప్రసాద్‌కు కేటాయించింది. అప్పటి నుంచి మార్కెటింగ్ శాఖ అధికారులకు ఆయన అద్దె చెల్లిస్తూ వస్తున్నాడు. అయితే, 2022 జూన్ నుంచి రెండు నెలల పాటు ఈ షాపు తెరవలేదు. దీంతో ఆ షాప్‌పై వైసీపీ నాయకుల కన్నుపడింది. ఆ షాపును తమకు విక్రయించినట్లుగా వైసీపీ నాయకుడు ఓ తప్పుడు అగ్రిమెంట్ తయారు చేసి దానిపై దుర్గాప్రసాద్ సంతకాన్ని ఫోర్జరీ చేశారు. నాటి అధికార పార్టీ అండతో ఈ షాపును బలవంతంగా స్వాధీనం చేసుకున్నారు. ఈ విషయమై ఎస్టేట్ అధికారికి, అదేవిధంగా మార్కెటింగ్ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్‌కు బాధితుడు దుర్గాప్రసాద్ ఫిర్యాదు చేసినా ఫలితం లేదు. దీంతో కోర్టును ఆశ్రయించగా మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చింది. ఈ ఉత్తర్వులతో అప్పటి మార్కెటింగ్ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్‌ను సంప్రదించేందుకు వెళ్లిన దుర్గాప్రసాద్‌ను కార్యాలయంలోకి కూడా రానివ్వలేదు. గతంలో తనకు జరిగిన అన్యాయం గురించి తెలుగుదేశం పార్టీ కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత టీడీపీ నేతలను కలిసి చెప్పాడు. కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్‌ను కలిసి దుర్గాప్రసాద్ తనకు జరిగిన అన్యాయం గురించి వివరించారు. వెంటనే స్పందించిన పెమ్మసాని, సంబంధిత మార్కెటింగ్ శాఖ అధికారులకు ఫోన్ చేసి దుర్గాప్రసాద్‌కు న్యాయం చేయాలని ఆదేశించారు. దీంతో. మార్కెటింగ్ శాఖ అధికారులు సంబంధిత 18వ నంబరు షాపు వ్యవహారాన్ని పెండింగ్‌లో ఉంచారు. అయితే, ప్రస్తుతం ఆ షాపు నిర్వహిస్తున్న వైసీపీ నాయకుడు, టీడీపీ నేతలను కలిసి తనకు అను కూలంగా వ్యవహరించాలని లోపాయికారి ఒప్పందాలకు ప్రయత్నిస్తున్నట్లు తెలియడంతో తూర్పు నియోజకవర్గ టీడీపీ కార్యకర్తలు ఆందోళన చెందు తున్నారు. ఈ విషయాన్ని కేంద్రమంత్రి పెమ్మసాని దృష్టికి తీసుకువెళ్లాలని నిర్ణయించారు. ప్రస్తుతం 18వ నంబర్ షాపు నిర్వహిస్తున్న వైసీపీ నాయ కుడు ఈ షాపును రూ.25 లక్షలకు వేరే వారికి విక్రయించారని, అందుకు గాను రూ.50 వేలు అడ్వాన్స్‌గా కూడా తీసుకున్నారని ప్రచారం జరుగుతోంది. పూల మార్కెట్‌లో జరుగుతున్న ఈ మొత్తం వ్యవహారాన్ని తోటి వ్యాపారులు, టీడీపీకి చెందిన పూలవ్యాపారులు వ్యతిరేకిస్తున్నారు. కనీసం కూటమి ప్రభుత్వం ఆయినా బాధితుడికి న్యాయం చేయాలని కోరుతున్నారు.

నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరణ


నూతన క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఫెడరేషన్ నాయకులు

గుంటూరు(తూర్పు), జనవరి 2 (ఆంధ్రజ్యోతి): స్థానిక బృందావన్ గార్డెన్స్‌లో యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా శాఖ ఆవరణలో ఆల్ ఇండియా ఎక్స్ సర్వీస్‌మెన్ బ్యాంక్ ఎంప్లాయీస్ ఫెడరేషన్, గుంటూరు యూనిట్ ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను సంఘ నాయకులు ఆవిష్కరించారు. అనంతరం నూతన సంవత్సరంలో సంఘ కార్యాచరణ లక్ష్యాలు, సభ్యుల అభ్యున్నతి, మాజీ సైనికుల కుటుంబాల సం క్షేమానికి ప్రణాళికలపై చర్చించారు. కార్యక్రమంలో ఫెడ రేషన్ ఆర్గనైజింగ్ సెక్రటరీ కొమర నాగప్రసాద్, బండ్ల రవి కుమార్, మాదాల రాంబాబు, శ్రీనివాసరావు, రమేష్, వంశీ, హరికృష్ణ, కల్యాణ్, పలు బ్యాంకులలో పనిచేసే మాజీ సైనికులు పాల్గొన్నారు.

ఉపకారవేతనాల నిధికి విరాళం అందజేత


సామినేని కోటేశ్వరరావుకు చెక్కును అందజేస్తున్న ఆలపాటి శ్రీధర్

గుంటూరు(తూర్పు), జనవరి 2 (ఆంధ్రజ్యోతి): కుల, మతాలకు అతీతంగా ప్రతిభ కలిగిన పేద విద్యార్థులకు కమ్మ జన సేవ సమితి ఆధ్వర్యంలో అందజేసే ఉపకార వేతనాల నిధికి ప్రవాసాంధ్రుడు ముప్పా నాగ మల్లేశ్వరరావు రూ.లక్ష విరాళాన్ని ప్రకటించారు. ఈ విరాళం చెక్కును గురువారం ముప్పా నాగమల్లేశ్వరరావు తరఫున సమితి అధ్యక్షుడు సామినేని కోటేశ్వర రావుకు ఆలపాటి శ్రీధర్ అందజేశారు. కార్యక్రమంలో సమితి ఉపాధ్యక్షుడు మల్లెల హరేంద్రనాథ్ చౌదరి, సభ్యులు గుంటుపల్లి కోటేశ్వరరావు, వడ్లమూడి నాగేంద్రం, ఆర్‌వీఆర్ జేసీ కళాశాల ఎన్‌సీసీ కోఆర్డినేటర్ మద్దినేని సుధాకర్ పాల్గొన్నారు.

ఉన్నత భవిష్యత్తుకు చదువే ప్రామాణికం
● ఎమ్మెల్సీ లేళ్ళ అప్పిరెడ్డి

గుంటూరు, జనవరి 2(ఆంధ్రజ్యోతి): మానవ జీవితంలో ప్రతి ఒక్కరి ఉన్నతికి చదువే ప్రామాణికమని స్ఫూర్తి ఫౌండేషన్ వ్యవస్థాపకుడు, ఎమ్మెల్సీ లేళ్ళ అప్పిరెడ్డి వ్యాఖ్యానించారు. అంతటి విలువైన చదువుకు పేదరికం ఆటంకం కారాదన్న సదుద్దేశంతో స్ఫూర్తి ఫౌండేషన్ ఏర్పాటు చేసి విద్యార్థులకు ఆలంబనగా నిలుస్తున్నట్లు ఆయన తెలిపారు. స్ఫూర్తి ఫౌండేషన్ ఆధ్వర్యంలో గురువారం స్థానిక అరండల్‌పేటలోని బాలికల వసతి గృహంలో విద్యార్థినులకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బందా రవీంద్రనాథ్, ఆలా సాంబశివరావు, బత్తుల దేవానంద్, కార్పొరేటర్లు ఈచంపాటి వెంకటకృష్ణ (ఆచారి), పాపతోటి అంబేడ్కర్, షేక్ రోషన్ తదితరులు పాల్గొన్నారు.

ఫిబ్రవరి 28 లోపు లైఫ్ సర్టిఫికెట్ అందజేయండి

గుంటూరుసిటీ, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పెన్షనర్లు జనవరి 1వ తేదీ నుంచి ఫిబ్రవరి 28 లోపు జీవన్ ప్రామాన్ అప్లికేషన్ ద్వారా లైఫ్ సర్టిఫికెట్ సమర్పించాలని జిల్లా ఖజానా అధికారి స్వామినాథన్ తెలిపారు. బయోమెట్రిక్ (చేతి వేలి ముద్రలు) సరిగ్గా లేనివారు, ఆరోగ్యం సరిగా లేని వారు, మంచానికే పరిమితమైన వారు సంబంధిత ఉపఖజానా కార్యాలయంలో ఆ విషయం తెలియజేయాలని సూచించారు. ఆ విధంగా తెలియ జేస్తే సంబంధిత ఖజానా సిబ్బంది పెన్షనర్ వద్దకు వచ్చి లైఫ్ సర్టిఫికెట్‌ను ధ్రువీకరిస్తారని తెలిపారు.


పోటీల్లో గెలుపొందిన విద్యార్థులు

సత్తాచాటిన విజ్ఞాన్ వర్సిటీ విద్యార్థులు

గుంటూరు(విద్య),జనవరి 2 (ఆంధ్రజ్యోతి): చేబ్రోలు మండలం వడ్ల మూడి విజ్ఞాన్ యూనివర్సిటీ విద్యార్థులు చెన్నైలోని ఎస్ఆర్ఎం యూనివర్సిటీలో జరిగిన 38వ అసోసియేషన్ ఆఫ్ ఇండియన్ యూనివర్సిటీస్ ఇంటర్ యూనివర్సిటీ సౌత్ జోన్ ఫెస్టివల్‌లో సత్తాచాటారు. ఈ విషయాన్ని విజ్ఞాన్ వర్సిటీ వైస్ చాన్స్‌లర్ కల్నల్, ప్రొఫెసర్ పీ.నాగభూషణ్ గురువారం తెలిపారు. ఈ సందర్భంగా బహుమతులు సాధించిన విద్యార్థులకు అభినందన సభను ఏర్పాటు చేశారు. వైస్ చాన్స్‌లర్ కల్నల్, ప్రొఫెసర్ పీ నాగభూషణ్ మాట్లాడుతూ వెస్ట్రన్ ఇన్‌స్ట్రుమెంటల్ సోలో, వన్ యాక్ట్ ప్లే, కొలాజ్ కాంపిటీషన్, కల్చరల్ ర్యాలీ, వెస్ట్రన్ వోకల్ సోలో, ఎలక్యూషన్, స్కిట్, మైమ్, ఫోక్ ఆర్కెస్ట్రా, డిబేట్, కార్టూనింగ్, రంగోలి విభాగాల్లో తమ విద్యార్థులు మొత్తం 12 బహుమతులు సాధించారని చెప్పారు. జాతీయ స్థాయి పోటీలకు కూడా ఎంపికైనట్లు తెలిపారు. వీరికి నోయి డాలోని అమిటీ యూనివర్సిటీలో మార్చి 3 నుంచి 7వ తేదీ మధ్యలో జాతీయ స్థాయి పోటీలు ఉంటాయని వివరించారు. బహుమతులు సాధించిన విద్యార్థులతో పాటు జాతీయస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను విజ్ఞాన్ విద్యా సంస్థల చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య, వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ పీ.నాగభూషణ్, ఇంచార్జి రిజిస్ట్రార్ డాక్టర్ పీఎంవీ రావు అభినందించారు.

సదరం సర్టిఫికెట్ల రీవెరిఫికేషన్‌కు ప్రత్యేక బృందాలు


వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ నాగలక్ష్మి, జీఎంసీ కమిషనర్ పులి శ్రీనివాసులు

గుంటూరు మెడికల్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం విభిన్న ప్రతిభావంతుల కేటగిరిలో ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల సదరం సర్టిఫికెట్ల రీ వెరిఫికేషన్‌కు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేయాలని కలెక్టర్ నాగలక్ష్మి తెలిపారు. ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల సదరం సర్టిఫికెట్ల రీ వెరిఫికేషన్ ప్రక్రియపై జిల్లా కలెక్టర్లతో రాష్ట్ర సచివాలయం నుంచి వైద్య ఆరోగ్య శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎంటీ కృష్ణబాబు, పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి శశిభూషణ్ కుమార్ గురువారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహిం చారు. పెన్షన్ల సదారం సర్టిఫికెట్ల రీ వెరిఫికేషన్‌పై వైద్య ఆరోగ్య శాఖ, గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులు నిర్వర్తించిన విధులు, వెరి ఫికేషన్ వివరాలను నమోదు చేసే విధానాన్ని ఎంటీ కృష్ణబాబు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. జిల్లా కలెక్టర్లకు పలు సూచనలు చేశారు. కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలు నుంచి కలెక్టర్ ఎస్ నాగలక్ష్మి, జీఎంసీ కమిషనర్ పులి శ్రీని వాసులుతో కలసి పాల్గొన్నారు. వీడియో కాన్ఫరెన్స్ అనం తరం అధికారులతో కలెక్టర్ మాట్లాడుతూ తొలి విడతలో మంచానికే పరిమిత మైన విభిన్న ప్రతిభావంతులు (85 శాతం వైకల్యం) సదరం సర్టిఫికెట్ల రీ వెరి ఫికేషన్‌ను ఇంటింటికి వెళ్లి ప్రత్యేక బృందాలు పరిశీలించేలా రూట్ ప్లాన్ సిద్ధం చేయాలన్నారు. సమా వేశంలో జిల్లా పరిషత్ సీఈవో జ్యోతిబసు, డీఆర్‌డీఏ పీడీ విజయలక్ష్మి, డీపీవో సాయికుమార్, డీఎంహెచ్‌వో డాక్టర్ కే విజయలక్ష్మి, జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ రమణ యశస్వి తదితరులు పాల్గొన్నారు.


సచివాలయ ఉద్యోగుల క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి డోలా బాలవీరాంజనేయ స్వామి, చిత్రంలో సంఘ రాష్ట్ర అధ్యక్షుడు షేక్ అబ్దుల్ రజాక్ తదితరులు

సచివాలయ ఉద్యోగుల క్యాలెండర్‌ను ఆవిష్కరించిన మంత్రి

గుంటూరు సిటీ, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ గ్రామ వార్డు సచివాలయ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం క్యాలెండర్‌ను మంత్రి డోలా బాల వీరాంజనేయ స్వామి గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సచివాలయ ఉద్యోగులు నూతన సంవత్సరం లో నూతన ఉత్సా హంతో పనిచేసి ప్రభుత్వ లక్ష్యాలను సాధించాలని సూచించారు. ఈ కార్య క్రమంలో సంఘ రాష్ట్ర అధ్యక్షులు షేక్ అబ్దుల్ రజాక్, ప్రధాన కార్యదర్శి కూన వెంకట సత్యనారాయణ, రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.


క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే గళ్లా మాధవి

నియోజకవర్గ అభివృద్ధికి కట్టుబడి పని చేస్తా: ఎమ్మెల్యే మాధవి

గుంటూరు, జనవరి 2(ఆంధ్రజ్యోతి): గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలో సమగ్ర అభివృద్ధికి కట్టుబడి పని చేస్తానని ఎమ్మెల్యే గళ్లా మాధవి అన్నారు. గుంటూరులోని తన కార్యాలయంలో గురువారం సాయంత్రం ఆమె ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. అనంతరం పలు మీడియా సంస్థల, తెలుగుదేశం పార్టీ అనుబంధ సంఘాల నూతన సంవత్సర క్యాలెండర్లను ఆమె ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలో తాను గెలిచినప్పటి నుంచి పారిశుధ్యం, తాగునీటి సరఫరాపై దృష్టి సారిం చానని, వాటి లక్ష్యాన్ని అధిగమించే విధంగా కృషి చేస్తున్నానని తెలిపారు. కోట్లాది రూపాయలతో సీసీ రోడ్లు, కాలువలను నిర్మిస్తున్నామని, మౌలిక సదుపాయాల కల్పనే లక్ష్యంగా పనిచేస్తున్నానని చెప్పారు.


గొడవర్రులో జరిగిన గ్రామసభలో ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న జిల్లా పంచాయతీ అధికారి బీవీ నాగసాయికుమార్

ప్రజాభిప్రాయం కోసం గ్రామసభలు ప్రారంభం
● జిల్లా వ్యాప్తంగా 238 చోట్ల నిర్వహణ
● వారం రోజుల పాటు కొనసాగనున్న కార్యక్రమం

గుంటూరు సిటీ, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో చట్టబద్ధమైన గ్రామ సభలు మొదలయ్యాయి. ఈ నెల 2 నుంచి వారం రోజుల పాటు ఈ సభలు నిర్వహించనున్నారు. జిల్లాలో 238 గ్రామ సభలు నిర్వహించి ప్రజాభిప్రాయ సేకరణ జరపనున్నారు. ఇప్పటివరకు ఆయా గ్రామ పంచాయతీలకు వచ్చిన నిధులను ఎందుకు వినియోగించారు, వాటిని ఏవిధంగా ఖర్చు పెట్టారు అనే విషయాలను అధికారులు ప్రజలకు వివరించనున్నారు. గ్రామానికి కావలసిన మౌలిక సదు పాయాలను గుర్తించి ఆయా పనులకు ఆమోదం తెలపనున్నారు. ఈ సందర్భంగా జిల్లా పంచాయతీ అధికారి బీవీ నాగసాయికుమార్ మాట్లాడుతూ కలెక్టర్ ఆదేశాల మేరకు గ్రామసభలు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ప్రజలు స్వచ్ఛందంగా పాల్గొని గ్రామాల్లో చేపట్టాల్సిన పనులపై అభిప్రాయాలు వెల్లడించాలని విజ్ఞప్తి చేశారు.

మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్‌కు నివాళి

గుంటూరు కార్పొరేషన్, జనవరి 2(ఆంధ్రజ్యోతి): భారతదేశ గతిని ప్రగతి వైపు మరల్చిన మహనీయుడు మన్మోహన్ సింగ్ అని మాజీ ఎంపీ యలమంచిలి శివాజీ అన్నారు. గుంటూరులోని భారతీయ విద్యా భవన్‌లో గురువారం మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ సంస్మరణ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా శివాజీ మాట్లాడుతూ సరళీకృత ఆర్థిక విధానాలతో, ప్రపంచీకరణ సూత్రాలను పాటిస్తూ క్లిష్ట పరిస్థితుల్లో ఉన్న భారతదేశాన్ని అభివృద్ధి వైపు పరుగులెత్తించిన పూర్వ ప్రధాని మన్మోహన్ సింగ్ ప్రపంచంలోనే అరుదైన రాజకీయవేత్తగా నిలిచారని కొని యాడారు. అనంతరం ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా చైర్మన్ డాక్టర్ రవి వడ్లమాని, భారతీయ విద్యా భవన్ కార్యదర్శి పీ రామచంద్రరాజు, జన చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణరెడ్డి , గాయకుడు గజల్ శ్రీనివాస్, సాహితీ సమాఖ్య రాష్ట్ర కన్వీనర్ ఎస్వీఎస్ లక్ష్మీ నారా యణ, రెడ్ క్రాస్ కాకినాడ జిల్లా చైర్మన్ వై. డీ రామారావు ప్రసంగించారు.

'మిర్చి యార్డులో రాజకీయాలకు తావు లేదు'


మిర్చి కమీషన్ ఏజంట్స్ అసోసియేషన్‌కు ఎన్నికైన నూతన పాలకవర్గం నాయకులు

గుంటూరు, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): మిర్చి యార్డులో రాజకీయాలకు ఎలాంటి తావు లేదని, వ్యాపారులంతా ఒక కుటుంబంతో సమానమని ది గుంటూరు చిల్లీస్ కమీషన్ ఏజంట్స్ అసోసియేషన్ నూతన అధ్యక్షుడు దాది నరేంద్ర బాబు తెలిపారు. స్థానిక పట్నంబజారులోని అసోసియేషన్ కార్యాలయంలో గురువారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వ్యాపా రులకు ఏమైనా పార్టీలుంటే అవి యార్డు బయటే తప్పా లోపల కాదన్నారు. రాష్ట్రంలో ఏ పార్టీ ప్రభుత్వం అధి కారంలో ఉంటే అందుకు అనుగుణంగా తాము సహకరిస్తామని, ఏటా మిర్చి లావాదేవీల ద్వారా యార్డుకు రూ.100 కోట్లకు పైగా ఆదాయం వచ్చేందుకు తాము కృషి చేస్తున్నట్లు చెప్పారు. ఈ దఫా అసోసియేషన్ ఎన్నికలు వ్యాపా రుల ఏకాభిప్రాయంతోనే జరిగాయని చెప్పారు. నామినేషన్లు దాఖలు చేసే తుది తేదీ వరకు కూడా ఎవరూ రాలేదని, ఇప్పుడు తమపై లేనిపోని వైసీపీ ముద్ర వేస్తున్నందుకు బాధ కలుగుతోందన్నారు. నూతన పాలకవర్గం త్వరలోనే కొలువుతీరనున్నట్లు చెప్పారు. కమీషన్ వ్యాపారుల సమస్యలపై టీడీపీ, జన సేన, బీజేపీ నేతల సహకారంతో సీఎం చంద్రబాబుకు నివేదించి వాటి పరిష్కారానికి చర్యలు చేపడతామన్నారు. సమావేశంలో అసోసియేషన్ ఉపాధ్యక్షుడు జంగా నర్సిరెడ్డి, కార్యదర్శి ముక్కాల విజయభాస్కర్ రెడ్డి, జాయింట్ సెక్రెటరీ ఏ రవికుమార్, కోశాధికారి పూరా నాగమల్లేశ్వరరావు పాల్గొన్నారు.

10 లోగా ట్రేడ్ లైసెన్సులపై సమగ్ర నివేదిక ఇవ్వాలి
● జీఎంసీ కమిషనర్ పులి శ్రీనివాసులు


మాట్లాడుతున్న కమిషనర్ పులి శ్రీనివాసులు

గుంటూరు కార్పొరేషన్, జనవరి 2(ఆంధ్రజ్యోతి): ఈ నెల 10వ తేదీ లోగా గుంటూరులోని శానిటరీ డివిజన్ల వారీగా ట్రేడ్ లైసెన్స్‌లపై సమగ్ర నివేదిక ఇవ్వాలని నగరపాలక సంస్థ కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదేశించారు. నగరపాలక సంస్థ కౌన్సిల్ సమావేశ మందిరంలో ప్రజారోగ్య విభాగపు అధికారులతో ట్రేడ్ లైసెన్స్‌లు, పారిశుధ్య పనులపై గురువారం సమీక్షా సమావేశం నిర్వహించారు. సమగ్ర నివేదికకు సంబంధించి ఈ మేరకు శాని టరీ ఇన్‌స్పెక్టర్లకు తగు ఆదేశాలు జారీ చేశారు. ఈ నెల 17 నుంచి ట్రేడ్ లైసెన్స్ లపై స్పెషల్ డ్రైవ్ చేపట్టనున్నట్లు కమిషనర్ తెలిపారు. ఈ సందర్భంగా శ్రీనివాసులు మాట్లాడుతూ వార్డు సచివాలయాల వారీగా ట్రేడ్ లైసెన్స్‌లు ఉండాల్సిన సంఖ్య కన్నా తక్కువగా ఉన్నాయని అన్నారు. నివేదిక మేరకు క్షేత్ర స్థాయిలో పరిశీలిస్తా మన్నారు. అలాగే, నగరంలో పారిశుధ్య విభాగ పనితీరులో మార్పు రావా లన్నారు. ఈ నెల 10 నాటికి నగరంలో రోడ్లపై ఆవులు, ఎద్దులు ఉండడానికి వీలు లేదని, వాటిని జీఎంసీ గోశాలకు తరలించాలని ఆదేశించారు.

నూతన డ్రెయిన్ల నిర్మాణానికి ప్రతిపాదనలు
● మేయర్ మనోహర్ నాయుడు


డ్రెయిన్ల జాబితాను పరిశీలిస్తున్న మేయర్ మనోహర్‌నాయుడు

గుంటూరు కార్పొరేషన్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): నగరంలో మర మ్మతులతో ఉన్న డ్రెయిన్ల స్థానంలో నూతన డ్రెయిన్లు నిర్మించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని నగర మేయర్ కావటి శివ నాగమనోహర్ నాయుడు తెలిపారు. స్థానిక సంపత్‌నగర్ రెండో లైన్‌లోని పార్క్ రోడ్డు, శృంగేరి శారద పరమేశ్వరి గుడి రోడ్డు, అయ్యప్ప స్వామి గుడి రోడ్డులో జీఎంసీ అధికారులతో కలిసి గురువారం ఆయన పర్యటించారు. ఆయా ప్రాంతాల్లోని ప్రజలు మేయర్ ను కలిసి తమ సమస్యలు విన్నవించారు. ఆయా ప్రాంతాల్లో నూతన డ్రెయిన్ల నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని, అవసరమైన చోట కల్వర్టులు నిర్మించాలని అధికారులను ఆదేశించారు.

ముత్యమల్లే మెరిసిపోయే
మంచు తీగ


తెనాలి: పెదరావూరు-వేమూరు రోడ్డుపై కమ్మేసిన పొగ మంచు


తెనాలి రైల్వే స్టేషన్‌లో దట్టంగా మంచు కమ్మేయటంతో కనిపించని ప్లాట్‌ఫారంలు


సత్తెనపల్లి పట్టణంలోని రహదారిపై దట్టంగా కప్పేసిన పొగమంచు


పిడుగురాళ్ల బైపాస్ రోడ్డుపై మంచు కప్పేయగా లైట్ల వెలుతురులో వెళుతున్న వాహనాలు

- కొత్త సంవత్సరంలో మంచు అందాలు
- పల్లెలు, పట్టణాలపై మంచు దుప్పటి
- ముత్యాలను తలపించేలా మంచు సోయగాలు

తెనాలి, జనవరి 2(ఆంధ్రజ్యోతి): పల్లెలు, పట్టణాలపై మంచు దుప్పటి కప్పిందా అన్నట్లు... తెల్లని మేఘాలు అలముకున్నట్లు... ఎటుచూసినా పొగ మంచే. దారి ఎటు మలుపుతిరుగుతుందో! ఎదురుగా ఏ వాహనం వస్తుందో కూడా కనిపించనంత దట్టమైన మంచు తుంపర్లు. కొత్త సంవత్సరంలో మంచు కనువిందు చేసింది. గురువారం తెల్లవారుజాము నుంచి ఉదయం 10 గంటల వరకు మంచు గ్రామాలను, పట్టణాలను కమ్మేసింది. గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల్లో ఏ రోడ్డు చూసినా దారి కనిపించనంతగా పొగ కమ్మేస్తే, తెనాలి రైల్వే స్టేషన్‌కూడా మంచు దుప్పటి కప్పుకుంది. ఉదయాన్నే వాహనాలపై వెళ్లేవారికి కాస్తంత అసౌకర్యంగా పరిస్థితి ఏర్పడితే, గ్రామాల్లో మాత్రం మంచు సోయగాలు కనువిందు చేశాయి. పొలాల్లో చెట్లపై, పుష్పాలపై మంచు బిందువులు ముత్యాల్లా మెరిసిపోతుంటే, సాలీడు కట్టుకున్న గూడుకూడా ముత్యాల హారంలా ఎంతో అందంగా కనిపించింది. గడ్డి పువ్వులపైనా మంచు సోయగాలు కనువిందే చేశాయి. చెట్ల ఆకులు పులకించేలా మంచు తడిపేసింది.


ఓ గడ్డిజాతి మొక్కకు పూసిన పువ్వు నూగుపై మంచు బిందువులు


తెనాలి
తెనాలి: మంచుతో మెరిసిపోతున్న సాలీడు గూడు


తెనాలి
దువ్వెన కాయగా చెప్పుకునే పువ్వుపై మంచు ముత్యాల సోయగం


జొన్న జాతి కంకులపై మంచు బిందువులు


తెనాలి
గడ్డిపోచకున్న పువ్వుపైనా మంచు ముత్యాలు

తొమ్మిది పదుల్లోనూ యోగా

బాపట్ల వాసి ఖాదర్‌వలి దక్షిణ తీసుకోని యోగాచార్యుడు. వేల మంది చిన్నారులకు యోగాలో ఉచిత శిక్షణ ఇచ్చే ఆయన క్రమశిక్షణ విషయంలో మాత్రం తగ్గరు. ఒకప్పుడు బాడీ బిల్డింగ్, కబడ్డీలో కూడా ఆయన శిక్షణ ఇచ్చేవారు. 1961లో 'మిస్టర్ గుంటూరు', 1967లో 'మిస్టర్ ఆంధ్రా'గా ఎంపికైన ఆయన యోగా ప్రస్థానం గురించి తెలుసుకోవాల్సిందే.

- తరగని ఉత్సాహం
- అరవై ఏళ్లుగా ఉచిత శిక్షణ
- ప్రతిఫలం కోరని యోగాచార్యుడు ఖాదర్‌వలి


మయూరాసనంలో ఖాదర్‌వలి (ఫైల్)


తొమ్మిది పదులు వయసు దాటినా ఇంట్లో బెడ్‌పై నుంచే చిన్నారులకు శిక్షణ ఇస్తున్న ఖాదర్‌వలి

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

ఆయన వయసు తొంభై రెండేళ్లు. ఆరు దశాబ్దాలుగా చిన్నారులకు యోగాసనాల్లో శిక్షణ ఇస్తున్నారు. అదీ కూడా ఎటువంటి ప్రతిఫలం ఆశించకుండా. అదే తనకు ఆనందాన్ని ఇస్తుం దని చెబుతున్న, దక్షిణ తీసుకోని ఆ యోగాచార్యుడు పేరు ఖాదర్‌వలి. బాపట్ల పట్టణ పరిధిలోని ఉప్పరపాలెం నివాసి ఖాదర్ వలి యోగ ప్రస్థానం తెలుసుకుందాం. విద్యుత్ శాఖలో ఉద్యోగిగా సేవలందించారు. తొలుత బిల్ కలెక్టర్‌గా తర్వాత వివిధ హోదాల్లో విధులు నిర్వహించారు. స్వస్థలమైన బాపట్లలో యూడీసీగా చేస్తూ పదవీవిరమణ చేశారు. ఉద్యోగ నిమిత్తం ఎక్కడకు వెళ్లిన అక్కడ పదిమంది చిన్నారులను కూడగట్టి వారికి యోగాలో శిక్షణ ఇవ్వడమే ఆయన వ్యాపకం. తెనాలి పరిధిలోని పెరవలిపాలెంలో దాసరి నరసింహారావు వద్ద శిష్యరికం చేసిన ఖాదర్ వలి యోగా నేర్చుకున్నారు.

వేల మంది చిన్నారులకు ఉచితంగా

1965 నుంచి ఆయన యోగా ప్రస్థానం మొదలైంది. తొలుత ఇంటి దగ్గరే ఆసక్తి గల పిల్లలకు శిక్షణ ఇచ్చేవారు. ఆ తర్వాత బడి ప్రాం గణాలను వేదికగా చేసుకుని ఆసనాలలో తర్ఫీదు ఇచ్చేవారు. ఈ ఆరు దశాబ్దాల ప్రస్థానంలో వేల మంది చిన్నారులకు శిక్షణ ఇచ్చారు. ఖాదర్‌వలి దగ్గర శిక్షణ పొందిన పిల్లలు ఎంతోమంది జాతీయ వేదికలపై తమ ప్రతిభను చాటారు. నేషనల్ యోగా కాంపిటీషన్స్‌లో సత్తా చాటిన బాపట్లకు చెందిన విద్యార్థిని స్నిగ్ధతో పాటు మరెంతో మంది ఆయన దగ్గర శిష్యరికం చేసిన వారే. నిన్నమొన్నటి వరకు కూడా ఆయన ఇంటి దగ్గర 50 మంది చిన్నారులు యోగా శిక్షణ కోసం వచ్చేవారు. ఖాదర్ వలి కాలుకి ఇటీవలే శస్త్ర చికిత్స జరిగింది. ఇప్పుడు కూడా రోజూ పదిమంది చిన్నారులకు ఆసనాలు నేర్పిస్తున్నారు.

బాడీ బిల్డింగ్, కబడ్డీలోనూ...

యోగాతో పాటు బాడీ బిల్డింగ్, కబడ్డీలో కూడా ఖాదర్ వలి శిక్షణ ఇచ్చేవారు. గతంలో బాడీ బిల్డింగ్ పోటీల్లో ఆయన పాల్గొన్నారు. 1961లో 'మిస్టర్ గుంటూరు'గా ఎంపిక కాగా, 1967లో యూపీలోని ఆలీఘడ్ యూనివర్సిటీలో జరిగిన బాడీ బిల్డింగ్ పోటీల్లో 'మిస్టర్ ఆంధ్రా'గా ఎంపికయ్యారు. ఆరు దశాబ్దాల ప్రస్థానంలో ఎన్నో పురస్కారాలు ఆయన్ని వరించాయి. ఆంధ్ర కబడ్డీ అసోసియేషన్ ఆయనకు జీవితకాల సాఫల్య క్రీడా పురస్కారం-2024ను అందించింది. వీటితోపాటు ఎన్నో క్రీడా అకాడమీలు ఆయనను సత్కరించాయి.

యార్డు ప్రక్షాళనకు శ్రీకారం

- పర్యవేక్షణకు ప్రత్యేక కమిటీల ఏర్పాటు
- ఇతర యార్డుల అధికారులకు స్థానం
- రాష్ట్ర మార్కెటింగ్ డైరెక్టర్ విజయ సునీత



గుంటూరు మిర్చియార్డు

గుంటూరు సిటీ, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): పీకల్లోతు అవినీతిలో కూరుకుపోయిన గుంటూరు మిర్చియార్డు ప్రక్షాళనకు రాష్ట్ర ప్రభుత్వం నడుంబిగించింది. రైతు ప్రయోజనాలకు ఎక్కడా భంగం వాటిల్లకుండా నూతన సంస్కరణలకు శ్రీకారం చుడుతోంది. గత ఐదేళ్లలో మిర్చియార్డులో రూ. 347 కోట్ల వరకు అక్రమాలు జరిగినట్లు విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ప్రభుత్వానికి నివేదిక సమర్పించిన నేపథ్యంలో రాష్ట్ర మార్కెటింగ్ శాఖ కొత్త చర్యలకు ఉపక్రమించింది. ఆ వివరాలను రాష్ట్ర మార్కెటింగ్ డైరెక్టర్ విజయ సునీత 'ఆంధ్రజ్యోతి'కి వెల్లడించారు. మిర్చియార్డులో జరుగుతున్న రోజువారీ కార్యక్రమాలపై ప్రత్యేక నిఘా ఉంచినట్లు తెలిపారు. ప్రతి రోజూ నివేదిక తెప్పించుకుని వాటిని పరిశీలిస్తున్నట్లు చెప్పారు. సీజన్ ఆరంభం నాటికి పూర్తిస్థాయి మార్పులకు చర్యలు చేపడుతున్నామని అన్నారు. ఇటీవల వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు యార్డులో సమీక్ష నిర్వహించి చేపట్టాల్సిన చర్యలపై ప్రత్యేక ఆదేశాలు ఇచ్చారని తెలిపారు. వాటి అమలుపై ప్రత్యేక శ్రద్ధ పెట్టినట్లు తెలిపారు. యార్డులో జరుగుతున్న కొనుగోలు, అమ్మకాల ప్రక్రియలో అవినీతి, అక్రమాలు నిలువరించేందుకు ప్రత్యేక కమిటీలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. స్థానిక అధికారులు ఇచ్చిన నివేదికలను ఈ కమిటీ ప్రత్యేకంగా పరిశీలించి వాస్తవాలను తేలుస్తుందని చెప్పారు. ఈ ప్రత్యేక కమిటీల్లో రాష్ట్రంలోని వివిధ యార్డులకు చెందిన అధికారులను నియమిస్తామని చెప్పారు. బయట వారిని నియమించి నివేదికలు అధ్యయనం చేయటం ద్వారా జవాబుదారీతనం మరింత పెరుగుతుందని పేర్కొన్నారు. మరో వారం రోజుల్లో కమిటీల ఏర్పాటు ప్రక్రియ ఒక కొలిక్కి వస్తుందని చెప్పారు. వచ్చే సీజన్‌లో రైతులకు, వ్యాపారులకు ఇబ్బంది లేకుండా పారదర్శకంగా అమ్మకాలు, కొనుగోలు ప్రక్రియ జరిగేలా చూడటమే తమ ముందున్న కర్తవ్యమని పేర్కొన్నారు. .యార్డు కార్యకలాపాలకు ఎటువంటి ఇబ్బంది లేకుండా, అవినీతి, అక్రమాలకు ఆస్కారం లేకుండా ప్రక్షాళన చేపడుతున్నామని వెల్లడించారు.

ప్రభుత్వ ఆదేశాలు వచ్చిన తరువాత చర్యలు

గత ప్రభుత్వ హయాంలో గుంటూరు మిర్చియార్డులో అవినీతికి పాల్పడినట్లు ఆరోపణలు ఉన్న అధికారులపై చర్యలు తీసుకుంటామని రాష్ట్ర మార్కెటింగ్ డైరెక్టర్ విజయ సునీత చెప్పారు. విజిలెన్స్ నివేదిక ప్రభుత్వానికి చేరిందని చెప్పారు. ప్రభుత్వం నుంచి మెమో వెలువడిన వెంటనే మార్కెటింగ్ అధికారులు, సిబ్బందిపై చర్యలు తీసుకుంటామని వెల్లడించారు.

సీసీ కెమెరాలు ఏర్పాటుపై సీసీఐకి లేఖ

రాష్ట్రంలోని పత్తి కొనుగోలు కేంద్రాల్లో సీసీ కెమెరాల ఏర్పాటు విషయమై సీసీఐకి లేఖ రాసినట్లు వెల్లడించారు. హైకోర్టు ఆదేశాల నేపథ్యంలో ఈ లేఖ రాశామని చెప్పారు. సీసీఐ కేంద్రాల్లో ఎటువంటి అక్రమాలు జరగకుండా చూసేందుకు వీలుగా ఎటువంటి కెమెరాలు ఏర్పాటు చేయాలి, ఎన్ని కెమెరాలు, ఎక్కడెక్కడ ఏర్పాటు చేయాలి వంటి వివరాల కోసం లేఖ రాసినట్లు తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ముందుకు వెళ్తామని చెప్పారు.

కలల రాజధానిపై.. కొత్త ఆశలు

(5వ పేజీ తరువాయి)

కొత్త కాంతులు తీసుకు వచ్చారు. రాజధాని అవసరాలకు తగినట్లుగా కొత్త విద్యుత్ లైన్లు, ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేశారు. కొత్త భవనాల్లో పనులను ప్రారంభించారు. జూలైలోనే ఫోరెన్సిక్ ల్యాబ్ నిర్మాణ పనులు మొదలయ్యాయి. నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డిజైన్(ఎన్ఐడీ) నిర్మాణ పనులు కూడా మొదలయ్యాయి. కేంద్ర పెద్దలను ఒప్పించడంతో అదే నెల కేంద్రం బడ్జెట్లో రాజధానికి రూ. 15వేల కోట్ల సహాయం ప్రకటించారు. దీంతో మొత్తం రాజధాని స్వరూపమే మారిపోబోతోందని తేలిపోయింది. ప్రపంచ బ్యాంకు, ఆసియా అభివృద్ధి బ్యాంకుల నుంచి సహాయం కూడా అందడంతో పనులు ఊపందుకోబోతున్నాయి. ఐకానిక్ భవనాలు, ట్రంకు రోడ్లు, లే అవుట్లకి సంబంధించి రూ. 24,276.83 కోట్లతో చేపట్టే పనులకు సీఆర్డీఏ ఆమోదం తెలిపింది. ఇప్పటికే సెక్రటేరియట్ పునాదుల్లో నీళ్ల తొలగించే పనులు చేపట్టారు. 4,688 కోట్లు నిర్మాణానికి కేటాయించారు. 250 మీటర్ల ఎత్తులో, 103 ఎకరాల్లో అసెంబ్లీ భవనాన్ని నిర్మించనున్నారు. 42.3ఎకరాల్లో శాశ్వత హైకోర్టు భవనాన్ని నిర్మించేందుకు ప్రణాళికల టెండర్ల ప్రక్రియ జరుగుతోంది. తక్షణ ప్రాతిపదికన ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ భవనాల నిర్మాణాలు చేపట్టాలని, ఆ తరువాత ప్రాధాన్య క్రమంలో ఆలిండియా సర్వీసెస్ ఉద్యోగుల భవనాలు, ఎన్జీవో భవన సముదాయాలను పూర్తి చేయాలని నిర్ణయించారు. ప్రభుత్వ కార్యదర్శుల భవనాలు, అధికారుల అపార్టుమెంట్లు అన్నీ వచ్చే ఏడాది అందుబాటులోకి వచ్చే అవకాశం కనిపిస్తోంది. వైసీపీ సర్కారు నిర్వాకంతో ఉనికే లేకుండా పోయిన హ్యాపీనెస్ట్ తిరిగి ప్రాణం పోసుకుంటోంది. రూ. 800 కోట్లతో భవనాల నిర్మాణానికి టెండర్ల ప్రక్రియ కొనసాగుతోంది.

● క్యూ కడుతున్న కేంద్ర సంస్థలు

కూటమి ప్రభుత్వం వచ్చాక అమరావతికి కేంద్ర సంస్థలు క్యూ కడుతున్నాయి. ఎయిమ్స్‌కు కొత్త వైభవం వచ్చింది. సాక్షాత్తూ రాష్ట్రపతి ద్రౌపది ముర్ము రాకతో ప్రాధాన్యం మరింత పెరిగింది. ఇండియా పోస్టు, ఇండియన్ నావీ, ఇండియన్ ఆర్మీ, భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్, బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్, సీబీఐ, సెంట్రల్ పబ్లిక్ వర్క్స్ డిపార్ట్‌మెంట్, కాగ్, ఆర్బీఐ, ఎంఐడీ, నాబార్డు, ఎస్‌బీఐ, యూబీఐ, ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా, ఎల్ఐసీ, ఐఓసీఎల్, హెచ్‌పీసీఎల్, బీపీసీఎల్, గెయిల్ వంటి సంస్థలకు గతంలోనే భూములు కేటాయించారు. ఇస్రో రీసెర్చ్ సెంటర్, నేషనల్ పోలీస్ అకాడమీ ఎక్స్‌టెన్షన్ క్యాంపస్, ఆలిండియా సర్వీసెస్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్, నేషనల్ గ్రీన్ ట్రైబ్యునల్ రీజనల్ కార్యాలయం, ఎన్‌సీసీ అకాడెమీ, ఆర్‌బీఐ, సీఏజీ, సీపీడబ్ల్యూజీ, ఎన్టీపీసీ, ఓఎన్‌జీసీ, ఇండియన్ బ్యాంక్, ఐసీఐసీఐ బ్యాంకుతో పాటు అనేక కేంద్ర సంస్థలు, 13 అంతర్జాతీయ విద్యాసంస్థలు రాజధాని అమరావతికి రానున్నాయి. ఒక్క మాటలో చెప్పాలంటే ఈ ఏడాది అమరావతికి మహర్దశ రాబోతోందని తెలుస్తోంది.

● కౌలు కష్టాలకు చెల్లు.. అసైన్డ్ రైతులకు విముక్తి

వైసీపీ ప్రభుత్వం వచ్చాక రాజధాని రైతులను కౌలు కష్టాలు వెంటాడాయి. రాజధాని రైతులపై కక్షబూనిన గత ప్రభుత్వం వారికి కౌలు చెల్లించకుండా వేధించింది. మూడేళ్లపాటు కౌలు నిలిపివేసింది. అసైన్డ్ రైతుల భూములపై సీఐడీ కేసులు బనాయించి కౌలుకు అనర్హులుగా ప్రకటించింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో రైతుల వార్షిక కౌలు వారికి దక్కింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన మూడు నెలల్లో ఒక ఏడాది కౌలు కింద రూ. 280 కోట్లు విడుదల చేసింది. రెండో ఏడాది కౌలు కూడా ఇచ్చేందుకు సన్నాహాలు చేస్తోంది. సీఐడీ కేసులతో నరకం చూస్తున్న 2,600 మంది రైతులకు కూటమి ప్రభుత్వం విముక్తి కలిగించింది. ఈ ఏడాది డిసెంబరుతో వారందరికీ విముక్తి పత్రాలు ఇవ్వడంతో వారికి కూడా కౌలు కష్టాలు తీరబోతున్నాయి. దీంతో వచ్చే ఏడాది నుంచి అమరావతిలోని ప్రతి రైతు ఇంట సంతోషాల పంట పండబోతోంది.

గోదాదేవి అమ్మవారికి సారె సమర్పణ

మంగళగిరి సిటీ, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): మంగళగిరి బాపూజీ విద్యాలయంలో జరుగుతున్న ధనుర్మాస వ్రత మహోత్సవాల్లో భాగంగా హైదరాబాద్, గుంటూరు తదితర ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు గోదాదేవి అమ్మవారికి సారెను సమర్పించారు. 18వ రోజైన గురువారం త్రిదండి చినజీయర్‌స్వామి 18వ పాశురాన్ని భక్తులకు వివరించారు. గోదా అమ్మవారికి అష్టోత్తరం, తీర్థప్రసాద గోష్టి నిర్వహించి, భక్తుల కు మంగళా శాసనాలు అందిం చారు. మైహోం గ్రూప్స్ అధినేత జూపల్లి రామేశ్వరరావు కుటుంబ సభ్యులు చినజీయర్‌స్వామి ఆశీర్వచనాలు అందుకున్నారు. చిన్నారులు ప్రదర్శించిన కూచిపూడి నృత్యాలు, సాంస్కృతిక, ఆధ్యాత్మిక కార్యక్రమాలు భక్తులను అలరించాయి.

ధనుర్మాస వ్రత మహోత్సవాల్లో పాల్గొన్న భక్తులు, అనుగ్రహ భాషణం చేస్తున్న చినజీయర్ స్వామి





కొనసాగుతున్న కానిస్టేబుల్ అభ్యర్థుల
దేహదారుఢ్య పరీక్షలు

- నేటి నుంచి మూడు రోజులపాటు మహిళా అభ్యర్థులకు పరీక్షలు

గుంటూరు, జనవరి 2(ఆంధ్రజ్యోతి): పోలీస్ పెరేడ్ గ్రౌండ్స్‌లో కానిస్టేబుల్ అభ్యర్థులకు దేహదారుఢ్య పరీక్షలు కొనసాగుతున్నాయి. మూడో రోజు గురువారం నిర్వహించిన దేహదారుఢ్య పరీక్షలకు 264 మంది హాజరు కాగా, వారిలో 18మంది సంబంధిత ధ్రువపత్రాలు లేకపోవడంతో వెనుతిరిగారు. మిగిలిన 246మందిలో 166 మంది తదుపరి పరీక్షలకు ఎంపికయ్యారు. ఆయా పరీక్షలకు సంబంధించిన వివరాల్లోకి వెళితే.. అభ్యర్థులకు శరీర కొలత పరీక్షలు (ఫిజికల్ మెజర్మెంట్ టెస్ట్) నిర్వహించగా వారిలో 31మంది ఛాతి, ఎత్తు తదితర కొలతలు సరిపోకపోవడంతో తిరస్కరించారు. మిగిలిన 215మందికి 1600 మీటర్ల పరుగుపందెం నిర్వహించగా 33 మంది అనర్హులు కాగా 182మంది తదుపరి పరీక్షల కొరకు అర్హత సాధించారు. 182మందికి 100 మీటర్ల పరుగు పందెం నిర్వహించగా వారిలో 68మంది అర్హత సాధించగా 114మంది విఫలమయ్యారు. 182 మందికి లాంగ్ జంప్ నిర్వహించగా వారిలో 167 మంది అర్హత సాధించగా 15మంది విఫలమయ్యారు. మొత్తం 246మంది కానిస్టేబుల్ అభ్యర్థులకు దేహదారుఢ్య పరీక్షలు నిర్వహించగా వారిలో 166 మంది అర్హత సాధించారు. కానిస్టేబుల్ దేహదారుఢ్య పరీక్షల నిర్వహణ తీరును ఎస్పీ సతీష్‌కుమార్ స్వయంగా పరిశీలించి, పరీక్షల నిర్వహణ అధికారులకు, అభ్యర్థులకు పలు సూచనలు చేశారు. ఈ నెల 3, 4, 6 తేదీల్లో మహిళా అభ్యర్థులకు పరీక్షలు జరుగుతాయని, 5న ఆదివారం సెలవు అని ఎస్పీ తెలిపారు. దీనిలో భాగంగా 3న 530 మందికి, 4వ తేదీ 535 మందికి, 6వ తేదీ 536 మందికి దేహదారుఢ్య పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. పురుష అభ్యర్థులకు ఈనెల ఏడో తేదీ నుంచి యథావిధిగా దేహదారుఢ్య పరీక్షలు జరుగుతాయని ఎస్పీ తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీలు సుప్రజ, హనుమంతు పలువురు అధికారులు పాల్గొన్నారు.


దేహదారుఢ్య పరీక్షల ఏర్పాట్లపై అధికారులకు ఆదేశాలిస్తున్న ఎస్పీ సతీష్‌కుమార్

గనికపూడిలో ట్రైయినీ అసిస్టెంట్ కలెక్టర్ స్వప్నిల్ పర్యటన

• సీసీ రోడ్డు నిర్మాణ పనుల పరిశీలన

ప్రత్తిపాడు, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని గనికపూడి గ్రామంలో జరుగుతున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను గురువారం ట్రైనీ అసిస్టెంట్ కలెక్టర్ స్వప్నిల్ జగన్నాధ్ పరిశీలించారు. అలాగే గ్రామంలో ఎన్డబ్ల్యూపీసీ షెడ్ను సందర్శించారు. కార్యక్రమంలో ఎంపీడీవో శివపార్వతి, ఈవోపీఆర్డి రవి కుమార్, డబ్బూరి శ్రీనివాసరావు గ్రామ సర్పంచ్ మహమ్మద్, కల్లూరి సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

'మహిళా నీకోసం'పై అవగాహన

దుగ్గిరాల, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర పోలీసు శాఖ తీసుకువచ్చిన 'మహిళా నీ కోసం' కార్యక్రమంపై గురువారం స్థానిక డిగ్రీ కళాశాలలోని విద్యార్థినులకు మంగళగిరి డీఎస్పీ కార్యాలయం మహిళా పోలీసులు ఎస్ నాగలక్ష్మి, బీ లలితకుమారిలు అవగాహన కల్పించారు. తమను తాము కాపాడుకునేందుకు ప్రతి ఒక్క మహిళ మనోధైర్యంతో ఉండాలని, ఈవ్‌టీజింగ్, ర్యాగింగ్ వంటి సమస్యలను ధైర్యంగా ఎదిరించాలని అన్నారు. అర్ధరాత్రి వేళ మహిళలు వారి గమ్యాన్ని చేరుకునే సమయంలో ఏదైనా సమస్య ఎదురైతే 9746414641 నెంబరుకు ఫోన్ చేస్తే పోలీసులు వచ్చి సురక్షితంగా వారిని ఇంటి వద్ద దిగబెడతారన్నారు. కార్యక్రమంలో జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సరళాదేవి, కళాశాల ఎన్ఎస్ కో-ఆర్డినేటర్ బీ. రాంబాబు, అధ్యాపకులు పాల్గొన్నారు.

సీసీ కెమెరాలు ప్రారంభం

పెదనందిపాడు, జనవరి 2(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని రావిపాడు పోలేరమ్మ దేవస్థాన కమిటీ ఆధ్వర్యంలో పోలీస్ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను గురువారం ఎస్ఐ మధుపవన్ ప్రారంభించారు. అధికారులు ఆదేశాల మేరకు సీసీ కెమెరా ఏర్పాటు చేసిన కమిటీ సభ్యులను ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు పొన్నం నాగేశ్వరావు, రామచంద్రరావు, గోవింద్ బ్రహ్మయ్య, రామినేని అప్పయ్య, ఖాజావలి, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

30వ రోజుకు ఏసీసీ కార్మికుల దీక్షలు

తాడేపల్లి టౌన్, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని బ్రహ్మానందపురంలో ఏసీసీ కార్మికులు చేపట్టిన దీక్షలు గురువారం 30వ రోజుకు చేరుకున్నాయి. దీక్షలను ప్రారంభించిన సీఐటీయూ డివిజన్ కార్యదర్శి వేముల దుర్గారావు మాట్లాడుతూ 30సంవత్సరాలుగా ఏసీసీ కార్మికుల సమస్యలను పరిష్కరించకపోవడం పాలకపక్షాల నిర్లక్ష్య ధోరణికి అద్దం పడుతోందని విమర్శించారు. దీక్షల్లో రమాదేవి, శారమ్మ, లక్ష్మి, సామ్రాజ్యం, దీనమ్మ కూర్చున్నారు. కార్యక్రమంలో యూనియన్ నేతలు కూరపాటి స్టీవెన్, ఆదినారాయణ, సూర్యప్రకాష్, అంకయ్య, సాంబయ్య ఆశీర్వాదం, ఇస్మాయిల్, నవనీతం తదితరులు పాల్గొన్నారు.

హెచ్ఎం అంకితభావం ఆదర్శనీయం



హెచ్ఎం శ్రీధర్‌ను సన్మానిస్తున్న ఎంఈవోలు, హెచ్ఎంలు

వట్టిచెరుకూరు, జనవరి 2(ఆంధ్రజ్యోతి): తాను విధులు నిర్వహిస్తున్న పాఠశాలను దేవాలయంగా అక్కడి విద్యార్థులు సొంత బిడ్డలుగా నిత్యం పాఠశాల అభివృద్ధికి పాటుపడుతున్న హెచ్ఎం శ్రీధర్ స్ఫూర్తి, ఆశయాన్ని అందరూ ఆదర్శంగా తీసుకోవాలని ఎంఈవో- 1 సత్యనారాయణమూర్తి గురువారం సూచించారు. మండలంలోని లేమల్లెపాడు ఎంపీపీ స్కూల్లో 2024లో ఒక్క రోజు కూడా సెలవు తీసుకోకుండా విద్యార్థులను తీర్చిదిద్దటంతో పాటు సౌకర్యాల కల్పనకు హెచ్ఎం శ్రీధర్ నిరంతరం శ్రమిస్తున్నారని అన్నారు. ఆయన సేవలను గుర్తించి ఎంఈవో కార్యాలయంలో ఎంఈవోలు సత్యనారాయణ మూర్తి, నిర్మల, హెచ్ఎంలు ఆయనను సన్మానించారు.

జానపద పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

మంగళగిరి, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జేఎన్‌టీయూ విశ్వవిద్యాలయంలో ఇటీవల జరిగిన 11వ అంతర్ రాష్ట్రీయ పోటీల్లో జానపద పాటల విభాగంలో నూతక్కి విజ్ఞాన విహార ఇంగ్లిషు మీడియం విద్యార్థినులు ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకున్నారు. యస్విని, హారిక, భాను, సాహితీలు లోక్‌సత్తా పార్టీ అధినేత జయప్రకాష్ నారాయణ చేతుల మీదుగా అవార్డులు అందుకున్నారు. విద్యార్థులను విజ్ఞానవిహార ప్రధానోపాధ్యాయుడు సురేష్, కార్యదర్శి వేణుగోపాలనాయుడు అభినందించారు.

వైభవంగా కల్యాణోత్సవం



వేంకటేశ్వరస్వామి ఆలయంలో కల్యాణోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు, పాల్గొన్న భక్తులు

దుగ్గిరాల, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): దుగ్గిరాలలోని వేంకటేశ్వరస్వామి వారి కల్యాణోత్సవాన్ని అర్చకులు సాకేత్, వేదాంతం రామచంద్రులు గురువారం వైభవంగా నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలను అందించారు. కొంగర సుధీర్‌కుమార్, కోనేరు మల్లికార్జునప్రసాద్, చుండూరు ఉమామహేశ్వరరావు, వంకదార ఫణికుమార్, పలువురు ఆలయ కమిటీ సభ్యులు భక్తుల ఏర్పాట్లను పర్యవేక్షించారు.

కాపుసంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా యర్రంశెట్టి

తాడేపల్లి, జనవరి 1(ఆంధ్రజ్యోతి): తాడేపల్లి మండలం ఉండవల్లి గ్రామానికి చెందిన యర్రంశెట్టి రాము జాతీయ కాపు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఉండవల్లి వాసులు రాము మిత్రబృందం మంగళగిరిలోని సంఘం కార్యాలయం రామును కలిసి అభినందించారు. కార్యక్రమంలో కాపు సంఘం నేత తోట సాంబశివరావు, ఎస్సీ నేతలు దొప్పలపూడి జ్యోతిబసు, నాగరాజు, బీసీనేతలు, మైనార్టీ నేతలు పాల్గొన్నారు.

క్యాలెండర్లు, డైరీల ఆవిష్కరణ

పెదనందిపాడు, జనవరి 2(ఆంధ్రజ్యోతి): స్థానిక ఎంఈవో కార్యాలయం వద్ద గురువారం యూటీఎఫ్ క్యాలెండర్, డైరీలను యూటీఎఫ్ సంఘ నాయకులు ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎంఈవోలు శ్రీనివాసరావు, జాకబ్, యూటీఎఫ్ నేతలు ముద్దన సత్యనారాయణ, ఎన్ రామకృష్ణ, ఎస్ కానిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మాజీ ఎంపీటీసీ శేషగిరిరావు మృతి

ప్రత్తిపాడు, జనవరి 2(ఆంధ్రజ్యోతి): టీడీపీ సీనియర్ నేత యనమదల మాజీ ఎంపీటీసీ మల్లంపాటి శేషగిరిరావు(60) గురువారం సాయంత్రం మృతి చెందారు. ఇటీవల ఆయన రోడ్డు ప్రమాదానికి గురై గుంటూరులోని ఓ ప్రైవేటు వైద్యశాలలో చికిత్స పొందుతూ మృతి చెందారు. ఆయన మృతికి ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులుతో పాటు, టీడీపీ నేతలు సంతాపం వ్యక్తం చేశారు.

రైతుల అభ్యున్నతికి కూటమి ప్రభుత్వం కృషి

• ఎమ్మెల్యే రామాంజనేయులు
• మల్లాయపాలెం మేజర్ కాలువ అభివృద్ధి పనులు ప్రారంభం



అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రామాంజనేయులు

పెదనందిపాడు, జనవరి 2(ఆంధ్రజ్యోతి): రైతుల అభ్యున్నతే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు అన్నారు. గురువారం మండల పరిధిలోని అబ్బినేనిగుంటపాలెం గ్రామం వద్ద మల్లాయపాలెం మేజర్ కాలువ అభివృద్ధి పనులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నీటిసంఘాల ఆధ్వర్యంలో కాలువల్లో పూడికతీత పనులు చేయించి చివరి భూములకు సాగు నీరు అందించడమే తమ లక్ష్యమన్నారు. తొలి విడతగా ఈ ప్రాంత కాలువల అభివృద్ధికి రూ.40 లక్షలు విడుదల చేశామన్నారు. రైతులతో విజిలెన్స్ కమిటీలను ఏర్పాటు చేసి ఆయా పనుల్లో నాణ్యతలను తనిఖీ చేయిస్తామని, ఆ తర్వాతే బిల్లులు విడుదల అవుతాయని స్పష్టం చేశారు. గుంటూరు ఛానల్ ఆధునికీకరణలో భాగంగా కాలువ పొడిగింపు పనులను పూర్తి చేస్తామన్నారు. నల్లమడ ముంపు నివారణకు చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో జనసేన నియోజవకర్గ ఇన్‌చార్జి నాగేశ్వరరావు, చైర్మన్ కల్లూరి కుసుమ, వైస్ చైర్మన్ మండల శ్రీనివాసరావు, సర్పంచ్ కల్లూరి శ్రీనివాసరావు, ఎన్ఎస్‌పీ డీఈ శ్రీనివాసరావు, ఏఈవో రమేష్, టీడీపీ నాయకులు మాదినేని శౌరిబాబు, నువ్వుల సునీల్ చౌదరి, బత్తిన వేణు, గింజుపల్లి శివరామ ప్రసాద్, కర్రి సుబ్బారెడ్డి, అగస్టీన్, తదితరులు పాల్గొన్నారు.

వంద పడకల ఆస్పత్రి నిర్మాణాన్ని స్వాగతిస్తున్నాం



సమావేశంలో పాల్గొన్న ప్రజారోగ్య వేదిక, వంద పడకల ఆసుపత్రి సాధన కమిటీ ప్రతినిధులు

మంగళగిరి, జనవరి 2(ఆంధ్రజ్యోతి): చినకాకాని కేన్సర్ ఆస్పత్రి ఆవరణలో వంద పడకల ప్రభుత్వ ఆస్పత్రిని నిర్మించాలన్న ప్రభుత్వ నిర్ణయాన్ని తాము స్వాగతిస్తున్నామని ప్రజారోగ్య వేదిక, మంగళగిరి వంద పడకల సమగ్ర ప్రభుత్వ ఆసుపత్రి సాధన కమిటీ ప్రతినిధులు స్పష్టం చేశారు. ఈ మేరకు గురువారం జరిగిన సమావేశంలో వేదిక రాష్ట్ర గౌరవాధ్యక్షుడు డాక్టర్ కేవీఎస్ సాయిప్రసాద్, కమిటీ కన్వీనర్ డాక్టర్ మాజేటి వంశీకృష్ణ తీర్మానాన్ని వెల్లడించారు. వారు మాట్లాడుతూ ఆస్పత్రి నిర్మాణానికి రూ.52 కోట్లు మంజూరు చేయడం అభినందనీయమన్నారు. సమావేశంలో ప్రజారోగ్య వేదిక డివిజన్ కన్వీనర్ జయరాజు, సభ్యులు ఎం నాగేశ్వరరావు, పీ బాలకృష్ణ, ఎస్ బాలకృష్ణ, ఎం రవి, సాధన కమిటీ సభ్యులు డీ నాగమణి, చిన్ని తిరుపతయ్య, ప్రభాకర్, గోవర్ధన్‌రావు, వెంకటేశ్వరరావు, ప్రసాద్, సుందర్‌రెడ్డి, టీ.రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఎంపీడీవోపై ఎమ్మెల్యే ఆగ్రహం

పెనందిపాడు, జనవరి 2(ఆంధ్రజ్యోతి): కాకుమాను ఎంపీడీవో యుగకీర్తిపై స్థానిక ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మండలంలోని అబ్బినేనిగుంటపాలెంలో ఓ కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యేని విలేకరులు కాకుమాను ఎంపీడీవో కార్యాలయంలో మినిట్స్ పుస్తకంలో పేజీల చించివేతపై వివరణ కోరారు. ఈ విషయంపై ఎమ్మెల్యే కాకుమాను ఎంపీడీవోకి ఫోన్ చేశారు. మినిట్స్ పుస్తకంలో పేజీల చించివేత అంశాన్ని ఎందుకు తమ దృష్టికి తీసుకురాలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఎస్ఎంసీ, హెచ్ఎంలకు శిక్షణ

ప్రత్తిపాడు, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): ప్రత్తిపాడు జడ్పీహైస్కూల్ ఎస్ఎంసీ సభ్యులకు, హెచ్ఎంలకు గురువారం ఒకరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈవోలు రమాదేవి, లీలారాణిలు మాట్లాడుతూ బడి బయటి పిల్లలను బడిలో చేర్పించడం, పనుల బాట పట్టకుండా చూడటం, బాల్య వివాహాలు నిరోధించడం వంటి పలు విషయాలపై వారికి తెలియజేశారు. కార్యక్రమంలో అన్ని పాఠశాలలకు చెందిన కమిటీ చైర్మన్లు, హెచ్ఎంలు పాల్గొన్నారు.

• పెదనందిపాడులో.. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో పాఠశాల నిర్వహణ, విధులు, బాధ్యతలు, బాలల హక్కుల పరిరక్షణ, విద్యావిధానాలు, సమావేశాల నిర్వహణ, అభివృద్ధి ప్రణాళిక, సామాజిక తనిఖీలు వంటి అంశాలపై ఎంఈవో ముద్దన శ్రీనివాసరావు అవగాహన కల్పించారు. అనంతరం మాదక ద్రవ్య రహితంగా ఉంటామని ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఎంఈవో -2 జాకబ్, ఆయా పాఠశాలల హెచ్ఎంలు, ఆర్పీలు, తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సులతో భూ సమస్యల పరిష్కారానికి కృషి

కాకుమాను, జనవరి 2(ఆంధ్రజ్యోతి): రెవెన్యూ గ్రామసభల ద్వారా భూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు తహసీల్దార్ వెంకటస్వామి అన్నారు. మండల పరిధిలోని రేటూరులో గురువారం రెవెన్యూ గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వ్యాప్తంగా 211 మంది అర్జీలు అందజేసినట్లు తహసీల్దార్ తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ ప్రణతి, ఆర్ఐ ప్రియదర్శిని, అధికారులు, రైతులు పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సుకు 24 అర్జీలు

తాడికొండ, జనవరి 2(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం చేపట్టిన రెవెన్యూ సదస్సు తాడికొండలో గురువారం గ్రామ పంచాయతీ కార్యాలయంలో నిర్వహించారు. రెవెన్యూ సదస్సుకు వివిధ సమస్యల పరిష్కారం కోసం 24అర్జీలు అందజేశారు. సర్వే సమస్యలు 11, ఆన్‌లైన్‌లో నమోదుకానివి 9, సోషల్ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్ సమస్య ఒకటి, దేవదాయ శాఖ 3 సమస్యలు పరిష్కారం కోరుతూ అర్జీదారులు దరఖాస్తు చేసుకున్నారు. అయితే దరఖాస్తు చేసుకున్న వారికి రెవెన్యూ సిబ్బంది ఎలాంటి స్లిప్పులు ఇవ్వలేదు. ఫోన్‌కు సమాచారం వస్తుందని సిబ్బంది తెలియజేశారు. కొన్ని సమస్యలు అక్కడికక్కడే తీర్చేవి ఉన్న రెవెన్యూ సిబ్బంది తీర్చటం లేదని దరఖాస్తులు వాపోయారు. కార్యక్రమంలో తహ సీల్దార్ కె.నాసరయ్య, ఆర్ఐ, వీఆర్వోలు, దేవదాయశాఖ అధికారులు పాల్గొన్నారు.

ప్రజల భాగస్వామ్యంతోనే సత్ఫలితాలు : ఎంఈవో

వట్టిచెరుకూరు, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): ఏ పథకమైనా విజయవంతంగా జరిగి అనుకున్న ఫలితాలు సాధించాలంటే ప్రజల భాగస్వామ్యం చాలా అవసరమని ఎంఈవో జీ సత్యనారాయణమూర్తి అన్నారు. వట్టిచెరుకూరులోని జిల్లా పరిషత్ ఆడిటోరియంలో గురువారం పాఠశాలల యాజమాన్య మండల స్థాయి సమావేశం నిర్వహించారు. ఎంఈవోలు జీ సత్యనారాయణమూర్తి, డి.నిర్మల అధ్యక్షతన మండలంలోని 43 పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ఎస్ఎంసీ కమిటీ చైర్మన్లకు నిర్వహించిన సమావేశంలో ఎంఈవో సత్యనారాయణమూర్తి మాట్లాడారు. విద్యాహక్కు చట్టం అమలుకు ప్రజల భాగస్వామ్యం ఎంతో కీలకమని చెప్పారు. ఎంఈవో-2 నిర్మల మాట్లాడుతూ ఎస్ఎంసీ కమిటీ సభ్యులు రోజుకు ఒకరి చొప్పున మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించాలన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, ఎంఎంసీ చైర్మన్‌లు పాల్గొన్నారు.

భూ సమస్యలపై ఎమ్మెల్యేకి వినతి

ప్రత్తిపాడు, జనవరి 2(ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వంలో నిర్వహించిన భూ రీసర్వేలో సర్వే నెంబరు 101లో 7.36 ఎకరాల భూమి, సర్వే నెంబరు 94 లో 19 ఎకరాల భూమి ని 22ఏ 1సిలో నమోదు చేశారని, దీంతో ప్రభుత్వ రెవెన్యూ వెబ్‌సైట్‌లో ఆ భూమిని బ్లాక్ అయిందని గనికపూడి గ్రామానికి చెందిన కొందరు రైతులు గురువారం ప్రత్తిపాడు ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులుకి విన్నవించారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే ఈ సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ కలెక్టర్‌కు సిఫార్సు చేశారు.

డీవైఎఫ్ఐ కమిటీ ఎన్నిక

మంగళగిరి సిటీ, జనవరి 2(ఆంధ్రజ్యోతి): స్థానిక డీవైఎఫ్ఐ కార్యాలయంలో గురువారం డీవైఎఫ్ఐ నూతన కమిటీని ఎన్నుకున్నారు. పట్టణ కన్వీనర్‌గా ఎస్ గణేష్, కోకన్వీనర్‌గా ఎం.రాంబాబు, మరికొందరు సభ్యులను ఎన్నుకున్నట్టు ప్రకటించారు. సమావేశంలో సీఐటీయూ నేతలు పాల్గొన్నారు.

ఉచిత కేన్సర్ స్క్రీనింగ్ వాహనం

• కృష్ణా జిల్లా ప్రజలకు అందుబాటులోకి
• ప్రారంభించిన ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్
• అల్ట్రాసౌండ్, మెమోగ్రామ్, ఎక్స్‌రే, కొలనోస్కోపీ.. అన్నీ అందులోనే



కేన్సర్ స్క్రీనింగ్ వ్యాన్‌ను ప్రారంభిస్తున్న డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్

మంగళగిరి, జనవరి 2(ఆంధ్రజ్యోతి): కృష్ణా జిల్లా ప్రజలకు ఉచితంగా కేన్సర్ నిర్ధారణ పరీక్షలు నిర్వహించేందుకు ఏర్పాటు చేసిన మొబైల్ కేన్సర్ స్క్రీనింగ్ వాహనాన్ని ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ప్రారంభించారు. గురువారం రాత్రి మంగళగిరిలోని క్యాంపు కార్యాలయంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. మచిలీపట్నం ఎంపీ వల్లభనేని బాలశౌరి చొరవతో భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్(భెల్) సంస్థ సీఎస్ఆర్ నిధుల కింద రూ.2 కోట్ల వ్యయంతో ఈ వాహనాన్ని ఏర్పాటు చేసింది. ఈ వాహనం ద్వారా కృష్ణా జిల్లాలోని ఏడు నియోజకవర్గాల్లో ప్రజలకు కేన్సర్ నిర్ధారణ పరీక్షలు ఉచితంగా చేయనున్నారు. ఈ వాహనం ద్వారా వారంలో మూడు రోజులు ఒక మండలంలోని అన్ని గ్రామాల్లో సంచరిస్తూ అల్ట్రాసౌండ్, మెమోగ్రామ్, రక్త పరీక్షలు, ఎక్స్‌రే, కెమికల్ ఎనాలసిస్, కొలనోస్కోపీ తదితర పరీక్షలు ఉచితంగా చేస్తారు. సామాజిక బాధ్యతతో వాహనాన్ని ఏర్పాటు చేసిన భెల్ సంస్థ ప్రతినిధులను, ఎంపీ బాలశౌరిని పవన్ కల్యాణ్ అభినందించారు. కార్యక్రమంలో మంత్రి కొల్లు రవీంద్ర, శాసనమండలిలో ప్రభుత్వ విప్ పిడుగు హరిప్రసాద్, ఎమ్మెల్యేలు మండలి బుద్ధప్రసాద్, వర్ల కుమార్‌రాజా, కాగిత కృష్ణప్రసాద్, వెనిగండ్ల రాము, బోడె ప్రసాద్, యార్లగడ్డ వెంకట్రావు, కృష్ణా జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ, ఏపీఎంఎస్ఐడీసీ చైర్మన్ చిల్లపల్లి శ్రీనివాసరావు, జిల్లా వైద్యాధికారులు పాల్గొన్నారు.

పది విద్యార్థులకు మెటీరియల్ పంపిణీ



విద్యార్థులకు మెటీరియల్ పంపిణీ చేసిన ఎస్‌టీయూ నాయకులు

తాడికొండ, జనవరి 2(ఆంధ్రజ్యోతి): పదో తరగతి విద్యార్థులకు ఉపయోగపడే విధంగా ఉపాధ్యాయులు మెటీరియల్ తయారు చేయటం అభినందనీయమని ఎంఈవో తెనాలి ఇందిరా పేర్కొన్నారు. గురువారం ఏపీ ఎస్‌టీయూ నాయకులు మోతడక రామోన్నత ఉన్నత పాఠశాలలోని పది విద్యార్థులకు మెటీరియల్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ అనుభవం కలిగిన ఉపాధ్యాయులతో ముఖ్యవిషయ పరిజ్ఞాన పుస్తకంను కేవలం 152 పేజీలతో రూపొందించారని తెలిపారు. కార్యక్రమంలో సీనియర్ ఉపాధ్యాయులు ఉండవల్లి నరసింహారావు, ప్రధానోపాధ్యాయిని ఆదేమ్మ, ఎస్‌టీయూ మండల అధ్యక్షుడు ఆరుద్ర వీరయ్య, ప్రధాన కార్యదర్శి బి.కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

శ్మశాసన వాటికల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలి

• రాజధాని గ్రామాల రైతులు

తుళ్లూరు, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): రాజధాని గ్రామాల్లో శ్మశాన వాటికల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని వెలగపూడి, మందడం, తాళ్లాయపాలెం, వెంకటపాలెం, కృష్ణాయపాలెంకు చెందిన రైతులు కోరారు. ఈ మేరకు విజయవాడ సీఆర్డీఏ ప్రధాన కార్యాలయంలో గురువారం అదనపు కమిషనర్ జీఎస్ఎస్. ప్రవీణ్‌చంద్ రైతులతో మాట్లాడారు. గ్రామాల్లో శ్మశాన వాటికల ఏర్పాటుపై సమీక్ష నిర్వహించారు. హిందూ, ముస్లిం, క్రైస్తవ శ్మశాన వాటికల ఏర్పాటు, వసతుల కల్పనపై ప్రజల అభిప్రాయాలు, సలహాలు తీసుకున్నారు. పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ద్వారా అదనపు కమిషనర్ రైతులకు అవగాహన కల్పించారు.

తెనాలి వార్తలు

◆ తెనాలి ◆ పొన్నూరు

నారాకోడూరు రహదారిపై జారిపడి వాహనచోదకులకు గాయాలు

చేబ్రోలు, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): గుంటూరు - నారాకోడూరు ప్రధాన రహదారిపై బురదతో ద్విచక్రవాహనదారులు గురువారం జారిపడ్డారు. నారాకోడూరులోని ఓ పెట్రోల్ బంక్ వద్ద బోరు పంపు వేసేందుకు సాయంత్రం మిషన్‌తో పనులు చేపట్టారు. దాని నుంచి వచ్చిన బురద ప్రధాన రహదారిపైకి చేరడంతో అది కనిపించక అటుగా వస్తున్న వాహనదారులు దాదాపుగా 10మంది ద్విచక్రవాహన చోదకులు జారిపడి గాయపడ్డారు. స్థానికులు వారిని పైకిలేపి చిన్నగాయాలు కావడంతో సపర్యలు చేసి బోర్ నిర్వాహకుల నిర్లక్ష్యంపై నిలదీశారు. రద్దీగా ఉండే ఈ రహదారిపై వరుసగా వాహనచోదకులు పడిపోతుండటంతో ఆ ప్రాంతంలో కొద్దిసేపు ట్రాఫిక్ నిలిచిపోయింది.

దాడి చేశాడని భర్తపై ఫిర్యాదు

తెనాలి, మారీసుపేట, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): తాగుడుకి బానిసైన భర్త భార్యపై దాడిచేసి గాయపరిచిన ఘటనపై కేసు నమోదు చేసినట్లు త్రీటౌన్ పోలీసుల తెలిపారు. స్థానిక సుల్తానాబాదు చెందిన బత్తుల నాగరాజు, అంకమ్మలు భార్యభర్తలు. వారు పిండి వంటలు చేసి విక్రయిస్తూ జీవనం సాగిస్తున్నారు. ఈ క్రమంలో తాగుడుకి బానిసైన భర్త నాగరాజు గురువారం మద్యం తాగేందుకు భార్య అంకమ్మను డబ్బులు అడగగా లేవని చెప్పడంతో కోపంతో దాడికి పాల్పడ్డాడు. దాంతో భార్యకు రక్తగాయాలయ్యాయి. గమనించిన స్థానికులు ఘర్షణను అడ్డుకొని బాధితురాలిని జిల్లా వైద్యశాలకు చికిత్స నిమిత్తం తరలించారు. చికిత్స పొందుతూ బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

భర్త అదృశ్యంపై ఫిర్యాదు

తెనాలి అర్బన్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): తెనాలి బస్టాండ్ వెనుక రోడ్డులో రెస్టారెంట్ నడుపుతున్న చందు శివప్రసాద్ (31) అదృశ్యం అయినట్లు టూటౌన్ పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. బుధవారం రెస్టారెంట్‌కు వెళ్ళి తిరిగి ఇంటికి రాకపోవటంతో అతని భార్య శిరీష ఫిర్యాదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

పలు ప్రాంతాల్లో సీసీ కెమెరాల ఏర్పాటు

● సీఐ రమేష్‌బాబు

తెనాలి, మారీసుపేట, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని త్రీ టౌన్ స్టేషన్ పరిధిలో సీసీ కెమెరాల ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. గురువారం స్థానిక పాత బస్టాండ్ కూడలి, తెనాలి రైల్వేస్టేషన్ కూడళ్ల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. రోడ్డుకు నాలుగువైపులా ప్రజల కదలికలను కెమెరాల ద్వారా పర్యవేక్షించేలా ఏర్పాటు చేశామన్నారు. దీనితో పట్టణంలో నేరాల సంఖ్య తగ్గే అవకాశం ఉంటుందన్నారు. రానున్న రోజుల్లో మరిన్ని ప్రాంతాలలో కెమెరాలను ఏర్పాటుచేసి స్టేషన్ పరిధిలో పూర్తిస్థాయిలో నేర నియంత్రణకు కృషి చేస్తామని సీఐ రమేష్‌బాబు వెల్లడించారు.

అన్న క్యాంటీన్లలో ఆన్‌లైన్ చెల్లింపులు ప్రారంభం

తెనాలి, మారీసుపేట, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): అన్న క్యాంటీన్‌లలో ఆన్‌లైన్ చెల్లింపుల విధానాన్ని గురువారం ప్రారంభించారు. స్థానిక చెంచుపేటలోని అన్న క్యాంటీన్‌లో ఆన్‌లైన్ సేవలను మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలో నిర్వహిస్తున్న అన్న క్యాంటీన్‌లలో ఇకపై ఆన్‌లైన్ ద్వారా చెల్లింపులు చేయవచ్చన్నారు. పేదలకు అందిస్తున్న అల్పాహారం నాణ్యతను పరిశీలించి సంతృప్తిని వ్యక్తం చేశారు. క్యాంటీన్ పరిసరాలలో పరిశుభ్రతలపై క్యాంటీన్ సిబ్బందికి పలు సూచనలు చేశారు.

● తెనాలి, మారీసుపేట: స్థానిక 22వ వార్డు 26వ సచివాలయాన్ని మున్సిపల్ కమిషనర్ ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సచివాలయంలోని పలు రికార్డులను పరిశీలించి, వార్డు ప్రజల సమస్యలను సత్వరమే పరిష్కరించాలని, ప్రజలతో మర్యదపూర్వకంగా మెలగాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నవనీత అలంకారంలో రంగనాయక స్వామి

చేబ్రోలు, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన చేబ్రోలులో శ్రీరంగనాయక స్వామి గురువారం నవనీత అలంకారంలో దర్శనమిచ్చారు. చేబ్రోలులో విశిష్ట ఆలయంగా వేలాది సంవత్సరాలుగా పూజలు అందుకుంటున్న శ్రీభూసమేత రంగనాయకస్వామికి ధనుర్మాసం సందర్భంగా గురువారం ప్రత్యేక పూజలు జరిగాయి. అభిషేకాల అనంతరం స్వామి వారిని నవనీత అలంకారంలో తీర్చిదిద్దారు. ఆదిశేషుడు పడగ నీడలో పవళించిన రంగనాయకస్వామిని వెన్న అలంకారంలో వీక్షించేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి తరలివచ్చారు. ఈ సందర్భంగా ఆలయంలో తిరుప్పావై పఠించారు. ఆలయ నిర్వాహకులు భక్తులకు తీర్థ ప్రసాదాలను వితరణ చేశారు.

'అంగన్‌వాడీ హెల్పర్ల సమస్యలు పరిష్కరించాలి'

పొన్నూరు టౌన్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): అంగన్వాడీ హెల్పర్ల సమస్యల పరిష్కరించాలని సీఐటీయూ మండల కార్యదర్శి నిమ్మకూరి రమేష్‌బాబు డిమాండ్ చేశారు. గురువారం సీడీపీవో వెంకట రమణకు సీఐటీయూ నాయకులు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా రమేష్‌బాబు మాట్లాడుతూ పొన్నూరు ప్రాజెక్టు పరిధిలో ఖాళీ అయిన అంగన్వాడీ వర్కర్ల పోస్టుల్లో అర్హులైన హెల్పర్లతో భర్తీ చేయాలని కోరారు. హెల్పర్లు దరఖాస్తు చేసుకొని ఇంటర్వ్యూలు పూర్తయినప్పటికీ ఏడాది కాలంగా పదోన్నతులు నిలిపివేయడం సరికాదన్నారు. జిల్లాలో అన్ని ప్రాజెక్టుల పరిధిలోని హెల్పర్లకు ప్రమోషన్లు ఇచ్చినప్పటికి పొన్నూరులో పదోన్నతులు కల్పించలేదని ఆరోపించారు. దీనిపై పలు మార్లు జిల్లా అధికారులకు ఫిర్యాదులు చేసినప్పటికి పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో అంగన్వాడీ వర్కర్లు, హెల్పర్స్ యూనియన్ అధ్యక్షురాలు ఎం వీ సుకన్య, రత్న మంజుల, పద్మజ, అనురాధ, సుజాత, షేక్ రేష్మ తదితరులు పాల్గొన్నారు.

చేతి వృత్తులవారికి ప్రత్యేక శిక్షణ

తెనాలి, మారీసుపేట, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): పురపాలక సంఘ పరిధిలో వివిధ రకాలైన చేతి వృత్తులవారికి ప్రత్యేక నైపుణ్య సాంకేతిక శిక్షణ తరగతులను నిర్వహిస్తున్నామని మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్లంబర్, కార్పెంటర్ ఎలక్ట్రీషియన్, ఎయిర్ కండిషనర్ (ఏసీ), టీవీ మెకానిక్, బ్యూటీషియన్ తదితరులకు నైపుణ్య సాంకేతిక శిక్షణ ఇచ్చి కోర్సు సర్టిఫికెట్ ఇస్తామని తెలిపారు. ఆసక్తి గలవారు ఈ నెల 6వ తేదీ లోపు పురపాలక సంఘ కార్యాలయంలోని మెప్మా విభాగంలో ఆధార్ కార్డు, రెండు పాస్‌పోర్ట్ ఫొటోలు, రేషన్‌కార్డు, బ్యాంకు పాస్‌బుక్, పాన్‌కార్డు కాపీలతో పాటు విద్యార్హత, అనుభవ ధ్రువీకరణ పత్రాలు తదితర వివరాలతో నమోదు చేసుకోవాలని ఆయన పేర్కొన్నారు.

దంతలూరులో వైద్య పరీక్షలు

కొల్లిపర, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): దీర్ఘకాలిక వ్యాధులపై తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యాధికారి ఎస్.సుమంత్ అన్నారు. గురువారం మండల పరిధిలోని దంతలూరులో వైద్యాధికారులు ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్ క్యాంపును నిర్వహించారు. వైద్యాధికారులు రోగులకు వైద్యపరీక్షలు నిర్వహించి మందులు పంపిణీచేసి తగిన సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ సందర్భంగా వైద్యాధికారి సుమంత్ మాట్లాడుతూ గ్రామాల్లో నిర్వహిస్తున్న మెడికల్ క్యాంపులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. మెడికల్ క్యాంపులకు రాలేని పక్షంలో అవసరమైతే ఇంటి దగ్గరకు వచ్చి వైద్య పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేయనున్నట్లు తెలియజేశారు. కార్యక్రమంలో ఎమ్ఎల్‌హెచ్‌పీ కవిత, ఏఎన్ఎం స్వరూపరాణి, హెల్త్ అసిస్టెంట్ శ్రీనివాసరావు, డీఈవో బి.కోటిరెడ్డి, ఆషా కార్యకర్తలు పాల్గొన్నారు.

చివరి భూములకు సైతం నీరందించడమే లక్ష్యం

● ప్రాజెక్టు కమిటీ చైర్మన్, వైస్ చైర్మన్


సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్ పంతాని మురళి

తెనాలి రూరల్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): చివరి సాగు భూములకు సైతం నీరందించటమే లక్ష్యంగా పని చేస్తామని ప్రాజెక్టు కమిటీ కృష్ణా డెల్టా సిస్టమ్ చైర్మన్ పంతాని మురళి, ఉప చైర్మన్ నువ్వుల సునీల్‌చౌదరి అన్నారు. గురువారం పట్టణంలోని కృష్ణా పశ్చిమ విభాగం తెనాలి జల వనరుల శాఖ కార్యాలయంలో కృష్ణా డెల్టా సిస్టమ్ తెనాలి కార్యవర్గ సమావేశం సూపరింటెండెంట్ దాసరి అనిల్‌కుమార్ పర్యవేక్షణలో నిర్వహించారు. నూతనంగా ఏర్పడిన డిస్ట్రిబ్యూటర్ కమిటీల 21 మంది చైర్మన్లను ప్రాజెక్టు కమిటీ చైర్మన్ పంతాని మురళీకృష్ణ, ఉప చైర్మన్ నువ్వుల సునీల్‌చౌదరిలకు పరిచయం చేశారు. తొలి సమావేశానికి విచ్చేసిన ప్రాజెక్టు కమిటీ చైర్మన్, వైస్ చైర్మన్లను ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కృష్ణ పశ్చిమ డివిజన్ తెనాలి పులిపాటి వెంకటరత్నం, ఈఈ నరసరావుపేట ఏవీ సుబ్బారావు, ఇరిగేషన్ చీరాల డీఈ ఎస్.కె.వి ప్రసాద్‌లు ఘనంగా సత్కరించారు. అనంతరం సభలో పంతాని మురళి మాట్లాడుతూ రైతులకు ఎంతో ఉపయోగకరంగా ఉన్న సాగునీటి సంఘాలను గత వైసీపీ ప్రభుత్వం తొలగించడంతో పంట, డ్రెయిన్ కాలువల ఆలనా పాలనా చూసేవారు లేక అవి పూడిపోయి పంటల సాగుకు సకాలంలో నీరు అందక రైతులు తీవ్ర ఇబ్బందులు పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. గత ఐదేళ్లుగా రైతులు పంట పొలాలకు సాగునీటి కోసం అనేక ఇబ్బందులు పడ్డారని గుర్తుచేశారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన వెంటనే వైసీపీ రద్దుచేసిన నీటి సంఘాలను తిరిగి పునరుద్ధరించిందని చెప్పారు. ప్రాజెక్టు వైస్ చైర్మన్ నువ్వుల సునీల్ చౌదరి మాట్లాడుతూ మూడు రోజుల్లో కమిటీలను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. పనుల, ఆర్థిక వనరుల, యాజమాన్య, పర్యవేక్షణ, మూల్యాంకన, శిక్షణ కమిటీలతో పంట, మురుగు డ్రెయిన్లను గుర్తించి వాటికి అవసరమైన బడ్జెట్ ప్రణాళిక వంటివాటిని నిర్ణయించి పనులు చేపట్టడం జరుగుతుందన్నారు. అనంతరం డిస్ట్రిబ్యూటర్ కమిటీ సభ్యులు ఒకొక్కరుగా వారి పరిధిలో ఉన్న సాగు నీటి కాలువలు పూడిపోవడాన్ని, లాకుల వద్ద షెల్టర్ల దుస్థితిని, పంట కాలువలో మురుగునీరు కలవడం, మోటర్ల ద్వారా సాగునీరందక రైతులు పడుతున్న ఇబ్బందులు వంటి పలు సమస్యలను ప్రాజెక్టు కమిటీ దృష్టికి తీసుకువచ్చారు. ప్రస్తుతం జొన్న, మొక్కజొన్న సాగు ముమ్మరంగా చేపట్టుతున్న రైతులకు సకాలంలో నీరందేలా చూడాలని కోరారు. గుంటూరు ఛానల్ 2 డీసీ వుప్పటూరి తిరుపతిరావు ఆ చానల్‌కు సంబంధించి ఉన్న సమస్యలపై వినతిపత్రం అందించారు. తొలుత కార్యాలయం ఆవరణలో ఉన్న డెల్టా సర్ ఆర్థర్ కాటన్ విగ్రహానికి ఘన నివాళులర్పించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు, అసిస్టెంట్ ఇంజనీర్‌లు, సాగునీటి సంఘాల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో జెండా పండుగ


తెలుగు బాప్టిస్టు చర్చి వద్ద ప్రత్యేక పూజలు చేస్తున్న ఎమ్మెల్యే నరేంద్ర కుమార్ దంపతులు

పొన్నూరు టౌన్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని చింతలపూడిలో బుధవారం రాత్రి తెలుగు బాప్టిస్టు చర్చి ఆధ్వర్యంలో జెండా పండుగ కార్యక్రమం భక్తిశ్రద్ధలతో జరిగింది. తెలుగు బాప్టిస్టు చర్చి వద్ద జెండా పండుగను పురస్కరించుకొని ఎమ్మెల్యే, సంగం డెయిరీ చైర్మన్ ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్, జ్యోతిర్మయి దంపతులతో పాటు వారి కుమార్తె నాగసాయి వైదీప్తి హాజరయ్యారు. జెండా ఆలంకరించిన వాహనం వద్ద ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి. జెండా అలంకరించిన వాహనాన్ని ఎమ్మెల్యే నరేంద్ర కుమార్ నడిపి ఊరేగింపులో పాల్గొన్నారు. కార్యక్రమంలో చింతలపూడి గ్రామస్థులు తెలుగు బాప్టిస్టు చర్చి యువత నిర్వాహకులు పాల్గొన్నారు.

ప్రజాసమస్యలు పరిష్కరించడం కోసమే గ్రామ సభలు

● ఎంపీడీవో విజయలక్ష్మి

కొల్లిపర, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలను పరిష్కరించడం కోసమే గ్రామాల్లో గ్రామ సభలు ఏర్పాటు చేయడం జరిగిందని ఎంపీడీవో విజయలక్ష్మి అన్నారు. గురువారం మండలంలోని అన్నవరం, అన్నవరంలంక, అత్తోట, చివలూరు, దావులూరు, కొల్లిపర, మున్నంగి, సిరిపురం, తూములూరు గ్రామాల్లో అధికారులు గ్రామ సభలు నిర్వహించారు. గ్రామ సభల్లో ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గామ సభల్లో తహసీల్దార్ సిద్ధార్థ, ఈవోపీఆర్‌డీ భార్గవ్, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

● చేబ్రోలు: గ్రామాల సుస్థిరాభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం సంపూర్ణ సహకారం అందిస్తుందని జిల్లా పంచాయతీ అధికారి సాయికుమార్ అన్నారు. మండల పరిధిలోని గొడవర్రులో గురువారం గ్రామ సభ జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన డీపీవో మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం భారీ ఆర్థిక సహకారం అందిస్తుందన్నారు. గ్రామాల్లో చెత్తరహితంగా అభివృద్ధి చేసేందుకు సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్ షెడ్లను ఉపయోగించుకోవాలని సూచించారు. ఈ నెల 8వ తేదీ వరకు గ్రామాలలో సభలు నిర్వహించనున్నట్లు చెప్పారు. సభలో ఎంపీడీవో కొప్పాక లలిత, ఈవోపీఆర్డీ ఉషారాణి, సర్పంచులు భీరం జానకిదేవి, మోరంపూడి అనితారాణి మన్నం శిరీష, జై హైమావతి తదితరులు పాల్గొన్నారు.

తొలగించిన కార్మికులను విధుల్లోకి తీసుకోవాలి

చేబ్రోలు, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): చేబ్రోలు పంచాయతీ కార్యాలయంలో తొలగించిన కార్మికులను తక్షణమే విధుల్లోకి తీసుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శిపై నేతాజీ డిమాండ్ చేశారు. గురువారం చేబ్రోలు సీపీఎం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన నేతాజీ మాట్లాడుతూ 20 సంవత్సరాలుగా పారిశుధ్య కార్మికులు పనిచేస్తున్నారన్నారు. నిబంధనలకు విరుద్ధంగా, ఇష్టారాజ్యంగా కార్మికులను తొలగించటం సరికాదన్నారు. చట్ట విరుద్ధంగా తొలగించిన కార్మికులను తక్షణమే విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. తమ డిమాండ్ నెరవేర్చకపోతే జిల్లావ్యాప్త ఆందోళనలకు పిలుపునివ్వనున్నట్లు హెచ్చరించారు. నిరసన ప్రదర్శనలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు దండా లక్ష్మీనారాయణ సీఐటీయూ మండల కార్యదర్శి సీహెచ్ హనుమంతరావు చింతల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల అభివృద్ధికి సహకరించాలి: ఎంఈవో

పొన్నూరు టౌన్ (చేబ్రోలు), జనవరి 2 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధిలో యాజమాన్య కమిటీలది కీలక భాగస్వామ్యం అని మండల విద్యాశాఖ అధికారి శ్రీనివాసరెడ్డి అన్నారు. నేతాజీనగర్ మున్సిపల్ హైస్కూల్లో గురువారం పాఠశాల యాజమాన్య కమిటీల శిక్షణ తరగతులు జరిగాయి. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ యాజమాన్య కమిటీల విధులు బాధ్యతల గురించి తెలియజేశారు. సమస్యల పరిష్కారంలో ప్రభుత్వ పాఠశాలల యాజమాన్య కమిటీల నిర్వాహకులు ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు. అలాగే చేబ్రోలు మండల పరిధిలో పాఠశాలల యాజమాన్య కమిటీ శిక్షణ తరగతులు గురువారం నారాకోడూరు జిల్లా పరిషత్ హైస్కూల్‌లలో జరిగాయి. ఎంఈవో రాయల్ సుబ్బారావు అధ్యక్షతన పాఠశాల యాజమాన్య కమిటీలకు శిక్షణ ఇచ్చారు.

రెవెన్యూ సదస్సుకు 18 అర్జీలు

పొన్నూరు టౌన్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని జడవల్లిలో గురువారం జరిగిన రెవెన్యూ సదస్సుకు 18 అర్జీలు దాఖలైనట్లు తహసీల్దార్ జియావుల్‌హక్ తెలిపారు. మ్యుటేషన్ కోసం 11, అడంగల్ మార్పు కోసం 1, పాస్ పుస్తకాల కోసం 4, మరణ ధ్రువీకరణ పత్రం కోసం 1 దరఖాస్తులు అందాయి.

రైతుల భూ సమస్యలు పరిష్కరిస్తాం

● ఇండిపెండెంట్ చార్జ్ తహసీల్దార్ పవార్ స్వాప్నిల్ జగనాథ్

తెనాలి రూరల్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): రైతులు ఎదుర్కొంటున్న భూ సమస్యలను రెవెన్యూ గ్రామ సభలతో పరిష్కరిస్తామని ఇండిపెండెంట్ చార్జ్ తహసీల్దార్ పవార్ స్వాప్నిల్ జగనాథ్ చెప్పారు. మండలంలో నిర్వహిస్తున్న రెవెన్యూ గ్రామసభల్లో భాగంగా గురువారం చినరావూరు సచివాలయంలో ఇండిపెండెంట్ చార్జ్ తహసీల్దార్ పవార్ స్వాప్నిల్ జగనాథ్, తహసీల్దార్ గోపాలకృష్ణలు ఇతర అధికారులతో కలిసి భూ సమస్యలపై రైతుల నుంచి అర్జీలు అందుకున్నారు. మొత్తం 21 అర్జీలు రాగా వాటిల్లో తొమ్మిది సర్వేకు రాగా మరో పన్నెండు రెవెన్యూ, మ్యుటేషన్ కోసం వచ్చినట్లు తహసీల్దార్ గోపాలకృష్ణ వెల్లడించారు. కార్యక్రమంలో దేవదాయశాఖ ఇతర అధికారులు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

మల్లెపాడు రోడ్డు గేటును పరిశీలించిన అధికారులు


రైల్వేగేట్ వద్ద పరిశీలిస్తున్న పవార్ స్వాప్నిల్ జగనాథ్, గోపాలకృష్ణ

మల్లెపాడు రోడ్డులోని గేట్ నెంబరు 247ను గురువారం ఇండిపెండెంట్ చార్జ్ తహసీల్దార్ పవార్ స్వాప్నిల్ జగనాథ్, తహసీల్దార్ గోపాలకృష్ణలు పరిశీలించారు. రైల్వే ట్రాక్ పనులు త్వరలో ప్రారంభం కానున్న నేపథ్యంలో దాదాపు పది నెలలపాటు అక్కడ ఉన్న గేట్‌ను మూసి వేయనున్నారు. ప్రజల రాకపోకలకు ఇబ్బందులు కలుగకుండా అండర్‌గ్రౌండ్ బ్రిడ్జ్ పనులు చేపట్టడం వంటి పనులపై అధికారులతో చర్చించినట్లు తహసీల్దార్ పేర్కొన్నారు.

ఆషా థియేటర్ పునఃప్రారంభానికి అనుమతుల పరిశీలన

తెనాలిలో రీమోడల్ చేసిన ఆషా థియేటర్ ప్రారంభానికి ప్రభుత్వ అనుమతులకు పెట్టుకున్న అర్జీపై గురువారం ఇండిపెండెంట్ చార్జ్ తహసీల్దార్ పవార్ స్వాప్నిల్ జగనాథ్, తహసీల్దార్ గోపాలకృష్ణలు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. వెహికల్స్ పార్కింగ్, వీక్షకులకు అవసరమైన సౌకర్యాలు వంటివాటిని తెలుసుకుని నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. నివేదికను ఉన్నతాధికారులకు పంపనున్నట్లు తహసీల్దార్ తెలియజేశారు.

● కొల్లిపర: రెవెన్యూ సదస్సులతో రైతులు భూ సమస్యలను పరిష్కరించుకోవాలని తహసీల్దార్ సిద్ధార్థ అన్నారు. గురువారం మండల పరిధిలోని చెముడుబాడులో జరిగిన రెవెన్యూ సదస్సులో ఆయన పాల్గొని రికార్డులను పరిశీలించారు. వివిధ సమస్యలపై ఆరు దరఖాస్తులు వచ్చాయి. కార్యక్రమంలో ఈవో పద్మావతి, ఆర్ఐ కిశోర్, ఏఎస్‌వో మనోహర్, రెవెన్యూ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

చెన్నకేశవ స్వామికి ప్రత్యేక పూజలు


ప్రత్యేక అలంకరణలో చెన్నకేశవ స్వామి

పొన్నూరు టౌన్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ములుకుదురులోని చెన్నకేశవ స్వామికి గురువారం ప్రత్యేక పూజలు జరిగాయి. స్వామి వారి జన్మ నక్షత్రమైన శ్రవణా నక్షత్రాన్ని పురస్కరించుకుని ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మూలవిరాట్‌కు పంచామృత అభిషేకాలను నిర్వహించారు. ఆలయ అర్చకులు నారాయణం కేశవమూర్తి, నారాయణం రవిబాబు, రొంపిచర్ల అనిల్ కుమార్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు జరిగాయి. సంగం డెయిరీ డైరెక్టర్ బొర్రు రామారావు, మాజీ ఎంపీపీ సీతమ్మ, తదితరులు ప్రత్యేక పూజలలో పాల్గొన్నారు.

ఘనంగా ధనుర్మాస వ్రత మహోత్సవాలు

తెనాలి అర్బన్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వీఎస్ఆర్ కళాశాల రోడ్డులో ధనుర్మాస వ్రత మహోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. శరణాగతి ఘోష్టి ట్రస్టు ఆధ్వర్యంలో జరుగుతున్న ఉత్సవాలలో గురువారం వెన్నతాళి ఉత్సవం నిర్వహించారు. గోదాదేవి 18వ పాసురం ప్రాముఖ్యతను నరేంద్ర రామానుజ దాసస్వామి భక్తులకు బోధించారు. కవ్వంతో పెరుగు చిలికి వెన్న చేసి అమ్మవారికి సమర్పించారు.